www.prajanaava.in

Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల రూ.5.00

ప్రజానావ
పాఠక మహాశయులకు విజ్ఞప్తి

తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
: 99484 33277 / 9014966169

Published from: Hyderabad, Rangareddy, Karimnagar Circulated to: Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 201 | శుక్రవారం | 17 జూలై, 2026



## భక్త జనసంద్రం.. జగన్నాథ రథయాత్ర

- 10 లక్షలకుపైగా తరలివచ్చిన భక్తులు
- పహండి ఆలస్యం.. గుండిచా ఆలయానికి చేరని మూడు రథాలు
- శుక్రవారం ఉదయం నుంచి రథయాత్ర పునఃప్రారంభం
- ఏఐ సీసీటీవీలు, డ్రోన్ జామర్లతో 13వేల మంది పోలీసుల భద్రత
- తొక్కిసలాటలో ఇద్దరు భక్తులు మృతి, మరో ఐదుగురికి అస్వస్థత

**భువనేశ్వర్:** ఒడిశాలోని ప్రసిద్ధ పూరీ జగన్నాథ రథయాత్రలో గురువారం భక్తజన సంద్రం కనిపించింది. 10 లక్షలకు పైగా భక్తులు రథయాత్రలో పాల్గొన్నప్పటికీ, పహండి ఆచారాలు ఆలస్యం కావడంతో జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రాదేవి రథాలు గుండిచా ఆలయానికి చేరుకోలేకపోయాయి. దీంతో శుక్రవారం ఉదయం నుంచి భక్తులకు మరోసారి రథాలను లాగే అవకాశం కల్పించినట్లు శ్రీ జగన్నాథ ఆలయ పరిపాలన (ఎస్‌జేటీఏ) అధికారులు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభం కావాల్సిన బలభద్రుడి తలధ్వజ రథం సుమారు గంట ఆలస్యంగా కదిలి, గ్రాండ్ రోడ్డుపై సుమారు 700 మీటర్లు ప్రయాణించి మార్కెట్ చక్ వద్ద నిలిచిపోయింది. సుభద్రాదేవి దర్పదళన రథం సుమారు 400 మీటర్లు మాత్రమే ప్రయాణించి మరీచికోటే చక్ వద్ద ఆగిపోయింది. జగన్నాథుడి నందిఘోష రథం సింహద్వారం సమీపంలో కొద్ది దూరం మాత్రమే కదిలి నిలిచిపోయింది. గుండిచా ఆలయానికి చేరుకోవాలంటే రథాలు మొత్తం 2.6 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి ఉంది. వర్షం కారణంగా ఆలయ ప్రధాన ద్వారం వద్ద జగన్నాథుడి విగ్రహాన్ని తరలించడంలో సుమారు 40 నిమిషాల ఆలస్యం జరగడంతో పహండి కార్యక్రమం ఆలస్యమైందని ఎస్‌జేటీఏ ప్రధాన పరిపాలనాధికారి అరవింద పదీ తెలిపారు. అయితే ఇతర ఆచారాలు నిర్ణీత సమయానికే పూర్తయ్యాయని ఆయన చెప్పారు. శుక్రవారం ఉదయం 9.30 గంటలకు రథాలను తిరిగి లాగనున్నట్లు అధికారులు వెల్లడించారు. దేవతలు శుక్రవారం రాత్రి కూడా రథాలపైనే ఉంటారని, శనివారం గుండిచా ఆలయంలోకి ప్రవేశించే ఉత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

### వర్షంలోనూ వెనక్కి తగ్గని భక్తులు

మధ్య మధ్యలో కురిసిన భారీ వర్షం కూడా భక్తుల భక్తి, ఉత్సాహాన్ని ఏమాత్రం తగ్గించలేకపోయింది. హరిబోల్ నినాదాలు, శంఖధ్వనులు, మేళతాళాల మధ్య వేలాది మంది భక్తులు రథాలను లాగుతూ ఆధ్యాత్మిక ఆనందంలో మునిగిపోయారు. పహండి ఉత్సవంలో ముందుగా సుదర్శనుడు, ఆ తర్వాత సుభద్రాదేవి, బలభద్రుడు, చివరిగా జగన్నాథుడు రథాలను అధిరోహించారు. రథయాత్రకు అంతరాయం కలగకుండా గ్రాండ్ రోడ్డుపై నిలిచిన వర్షపు నీటిని తొలగించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. పూరీలో తరువాయి 2లో..

### రథయాత్రలో అపశ్రుతి

జగన్నాథ రథయాత్ర సందర్భంగా భారీ భక్తుల రద్దీ, నిరంతర వర్షాల మధ్య ఇద్దరు భక్తులు మృతి చెందగా, మరో ఐదుగురు అస్వస్థతకు గురయ్యారు. మొత్తం ఏడుగురు అస్వస్థతకు గురికాగా, వారిని వెంటనే ఆస్పత్రులకు తరలించినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ) తెలిపింది. మృతుల్లో 60 ఏళ్లు పైబడిన ఓ భక్తుడు అస్వస్థతకు గురై చికిత్స పొందుతూ మరణించగా, మరో 35 ఏళ్లకు పైబడిన భక్తుడు గుండెపోటుతో ప్రాణాలు కోల్పోయాడు. వర్షం కారణంగా అలసట, డీహైడ్రేషన్, ఊపిరి ఆడకపోవడం వంటి సమస్యలతో పలువురు భక్తులు అస్వస్థతకు గురైనప్పటికీ చికిత్స అనంతరం చాలామందిని డిశ్చార్జ్ చేసినట్లు అధికారులు తెలిపారు. రథయాత్రలో భారీ రద్దీ ఉన్నప్పటికీ ఎలాంటి తొక్కిసలాట జరగలేదని, భక్తుల నిర్వహణలో లోపాలు చోటుచేసుకోలేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ ఘటనపై బీజేడీ అధినేత నవీన్ పట్నాయక్ విచారం వ్యక్తం చేస్తూ మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. భక్తుల భద్రతకు ప్రభుత్వం మరింత సమర్థంగా చర్యలు తీసుకోవాలని కోరారు.



## గోల్కొండ గుట్టపై బోనాల సందడి

- జగదాంబిక అమ్మవారికి తొలి బోనం సమర్పించిన మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్
- ఆలయ కమిటీకి రూ.11 లక్షల చెక్కు అందజేత

**ప్రజానావ, హైదరాబాద్:** గోల్కొండ జగదాంబిక అమ్మవారి బోనాల ప్రారంభోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని లంగర్‌హౌజ్ చౌరస్తాలో శుక్రవారం నిర్వహించిన వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఉత్సవ వేదికకు చేరుకున్న ఇరువురు మంత్రులకు ఆలయ అర్చకులు వేదమంత్రోచ్ఛారణల నడుమ పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం మంత్రులు జగదాంబిక అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. డప్పు చప్పుళ్లు, పోతురాజుల తరువాయి 2లో..

## మా హయాంలోనే ప్రాజెక్టులు పూర్తిచేస్తాం

### రైతుల కలలు సాకారం చేసే బాధ్యత మాదే

- గత ప్రభుత్వం తప్పిదంతోనే సీతమ్మసాగర్ ఆలస్యం
- పర్యావరణ అనుమతులు లేకుండానే ప్రారంభించడంతో న్యాయపరమైన చిక్కులు
- మరింత వేగంగా సీతారామ నిర్మాణ పనులు
- నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి



**ప్రజానావ, భద్రాద్రి కొత్తగూడెం:** తెలంగాణ రైతాంగ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని సాగునీటి రంగంలో చారిత్రాత్మక నిర్ణయాలతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సీతారామ ఎత్తిపోతల పథకం, సీతమ్మసాగర్ ప్రాజెక్టు, దేవాదుల ఎత్తిపోతల పథకాలను ప్రస్తుత ప్రభుత్వ హయాంలోనే పూర్తిచేసి రైతుల కలలను సాకారం చేస్తామని ఆయన తరువాయి 2లో..

### గోదావరి జలాలతో ఖమ్మంను సస్యశ్యామలం చేస్తాం

- వేగంగా సీతారామ, సీతమ్మసాగర్ పనులు
- బీఆర్ఎస్ పాలనలో సాగునీటి రంగానికి తీవ్ర నష్టం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

2



### రైతులకు నీళ్లు, విద్యుత్ ఇవ్వండి

- సాగునీరు, విద్యుత్ అంశాల్లో ప్రభుత్వం పూర్తిగా విఫలం
- విద్యుత్‌త్పత్తి పెంచి నాణ్యమైన బొగ్గు సరఫరా చేయాలి
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

2

### నీట్ యూజీ ఫలితాలు విడుదల



- ఆలిండియా టాపర్లుగా పంజాబ్‌కు చెందిన ఆర్యన్ గుప్తా, హర్యానా విద్యార్థి పన్షుల్ బన్సల్
- ఇద్దరికీ 720కి 715 మార్కులు

2

మధ్య మానేరు జలాశయం నుంచి సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఇల్లంతకుంట మండలానికి చెందిన పలు గ్రామాల రైతులు గురువారం కరీంనగర్–ఇల్లంతకుంట పొత్తూరు వంతెనపై బైఠాయించి రాస్తారోకో చేశారు. దాదాపు అరగంట పాటు ఆందోళన చేయడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. ఈ సందర్భంగా అన్నదాతలు మాట్లాడుతూ నీరు లేక పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే కాళేశ్వరం కన్నెపల్లి మోటార్లు ఆన్ చేసి మధ్య మానేరు ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

– ప్రజానావ, సిరిసిల్ల



# నీట్ యూజీ ఫలితాలు విడుదల

- ఆలిండియా టాపర్లుగా పంజాబ్‌కు చెందిన ఆర్యన్ గుప్తా, హర్యానా విద్యార్థి పన్షుల్ బన్సల్
- ఇద్దరికీ 720కి 715 మార్కులు
- అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌లో 1.7 లక్షల మంది క్వాలిఫై

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా వైద్య కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన నీట్-యూజీ 2026 ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) గురువారం రాత్రి విడుదల చేసింది. పంజాబ్‌కు చెందిన ఆర్యన్ గుప్తా, హర్యానాకు చెందిన పన్షుల్ బన్సల్ చెరో 720కి 715 మార్కులు సాధించి సంయుక్తంగా అఖిల భారత తొలి ర్యాంకును దక్కించుకున్నారు. ఈ ఏడాది పరీక్షకు హాజరైన అభ్యర్థుల్లో 11.21 లక్షల మంది అర్హత సాధించారు. గతేడాది కఠినమైన ప్రశ్నాపత్రం కారణంగా టాపర్‌కు కేవలం 686 మార్కులే రాగా, ఈసారి టాపర్లు 715 మార్కులు సాధించడం విశేషం. మొత్తం 19 మంది 700కు పైగా, 138 మంది 690కు పైగా మార్కులు సాధిం చారు. 690కు పైగా మార్కులు సాధించిన వారిలో 93 శాతానికి పైగా విద్యార్థులు తొలిసారిగా నీట్ పరీక్ష రాసినవారేనని ఎన్‌టీఏ వెల్లడించింది. ఈ ఏడాది 1,492 మంది విద్యార్థులు 650 లేదా అంతకంటే ఎక్కువ, 10,160 మంది 600 లేదా అంతకంటే ఎక్కువ మార్కులు సాధించారు. అర్హత పొందిన వారిలో 58 శాతానికి పైగా మహిళలే ఉండడం మరో విశేషం. 2025లో 12.36 లక్షల మంది అర్హత సాధించగా, ఈసారి ఆ సంఖ్య 11.21 లక్షలకు తగ్గింది. అయితే పరీక్షకు హాజరైన వారి సంఖ్య కూడా 22.09 లక్షల నుంచి దాదాపు 20 లక్షలకు తగ్గడంతో మొత్తం ఉత్తీర్ణత శాతం సుమారు 56 శాతం వద్ద స్థిరంగా కొనసాగిందని ఎన్‌టీఏ వెల్లడించింది.

### తెలంగాణకు టాప్-17లో చోటు

రాష్ట్రాల వారీగా చూస్తే ఉత్తరప్రదేశ్‌లో అత్యధికంగా 1.7 లక్షలకు పైగా మంది అర్హత సాధించారు. ఆ తర్వాత మహారాష్ట్ర, రాజస్థాన్ నిలిచాయి. 705కు పైగా మార్కులు సాధించిన తొలి 17 మంది విద్యార్థుల్లో తెలంగాణకు చెందిన ఒక అభ్యర్థి కూడా స్థానం దక్కించుకోవడం విశేషం. మొత్తం 17 రాష్ట్ర టాపర్లు 700కు పైగా మార్కులు సాధించగా, 26 మంది 690కు పైగా స్కోరు నమోదు చేశారు. దేశంలో ఎంబీబీఎస్ ప్రవేశాలకు సుమారు 1.08 లక్షల సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో సుమారు 56 వేల ప్రభుత్వ, 52 వేల ప్రైవేట్ వైద్య కళాశాలల్లో ఉన్నాయి. ఎంబీబీఎస్‌తో పాటు బీడీఎస్, ఆయుర్వేదం, యునానీ, సిద్ధ వైద్య కోర్సుల్లో ప్రవేశాలకు నీట్ ర్యాంకులనే పరిగణనలోకి తీసుకుంటారు. ఇదిలాఉంటే పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై నీట్-యూజీని పెన్-పేపర్ విధా నంలో కాకుండా కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) విధానంలో నిర్వహించనున్నట్లు ప్రకటించిం ది.



## 9వ తరగతిలో మూడో భాషపై సుప్రీం అభ్యంతరం

**న్యూఢిల్లీ:** 9వ తరగతి నుంచి మూడో భాషను తప్పనిసరి చేయడంపై సుప్రీంకోర్టు అభ్యంతరం వ్యక్తం చేసింది. బోర్డు పరీక్షలకు సన్నద్ధమయ్యే దశలో కొత్త భాషను ప్రవేశపెట్టడం విద్యార్థులపై అదనపు ఒత్తిడి పెంచుతుందని పేర్కొంది. చిన్న తరగతుల నుంచే కొత్త భాషను బోధిస్తే మంచిదని సూచించింది. సీబీఎస్ఈ మూడు భాషల విధానా న్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్ల విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. ప్రస్తుతం విధానాన్ని నిలిపివేయకుండా, 9వ తరగతిలో అమలుపై కేంద్రం మరోసారి ఆలోచించాలని సుప్రీంకోర్టు సూచించింది.

# హోంవర్క్‌లో కల్మా!

- హైదరాబాద్ ప్రైవేట్ స్కూల్‌లో దారుణం
- రెండో తరగతి హిందూ విద్యార్థికి ఇస్లామిక్ ప్రార్థన చదవాలని హోంవర్క్
- పాఠశాల ఎదుట వీహెచ్‌పీ, హిందూ సంఘాల నిరసన
- వివాదం చెలరేగడంతో ఉపాధ్యాయురాలి తొలగింపు
- క్షమాపణ అంగీకరించిన విద్యార్థి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు లేదు












**ప్రజానావ, హైదరాబాద్:** హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న హిందూ విద్యార్థికి ఇస్లామిక్ మతానికి చెందిన కల్మా చదవాలని హోంవర్క్ ఇచ్చినట్లు ఆరోపణలు రావడంతో వివాదం చెలరేగింది. ఈ ఘటనపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవడంతో సంబంధిత ఉపాధ్యాయురాలిని పాఠశాల యాజమాన్యం సేవల నుంచి తొలగించింది. పోలీసుల వివరాల ప్రకారం, బుధవారం రెండో తరగతి విద్యార్థులందరికీ హోంవర్క్‌గా కల్మా చదవాలని ఉపాధ్యాయురాలు సూచించారు. ఆ తరగతిలో మొత్తం 25 మంది విద్యార్థులు ఉండగా, వారిలో ఒకరు మాత్రమే హిందూ విద్యార్థి. విద్యా విధానంతో పాటు పాఠశాల నిబంధనలకు విరుద్ధంగా ఈ సూచనలు ఇవ్వడం జరిగిందని చార్మినార్ జోన్ డీసీపీ ఖరే కిరణ్ ప్రభాకర్ తెలిపారు. విద్యార్థి తల్లిదండ్రులు గురువారం పాఠ శాల ప్రధానోపాధ్యాయుడికి లేఖ రాసి, ఉపాధ్యాయురాలి క్షమాపణను అంగీకరించినట్లు తెలిపారు. తమ ఫిర్యాదును ఉపసంహరించుకోవాలని కూడా కోరారు. అయితే ఉపాధ్యాయురాలి తొలగింపు నిర్ణ యాన్ని వెనక్కి తీసుకోవాలా లేదా అన్న విషయంపై యాజమాన్యం ఇంకా నిర్ణయం తీసుకోలేదు. పాఠశాల యాజమాన్యం తీసుకున్న చర్యలతో సంతృప్తి ఉందని, సమస్య పరిష్కారమైందని విద్యార్థి తల్లిదండ్రులు పోలీసులకు తెలిపారు. ఇప్పటివరకు పోలీసులకు ఎలాంటి అధికారిక ఫిర్యాదు అందలేదని, అందువల్ల కేసు నమోదు చేయలేదని డీసీపీ వెల్లడించారు. ఫిర్యాదు వస్తే న్యాయసలహా తీసుకుని తదుపరి చర్యలు చేపడతామని చెప్పారు. వదంతులు ప్రచారం చేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అంతకుముందు ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన వీహెచ్‌పీ కార్యకర్తలు, ఇతర హిందూ సంఘాలు పాఠశాల ఎదుట నిరసన చేపట్టాయి. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో 30 మందికిపైగా నిరసనకారులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు.

### అందరికీ తప్పనిసరి చేయడం సరికాదు

విద్యార్థి అత్త మీడియాతో మాట్లాడుతూ, బాలుడి హోంవర్క్ డైరీలో ఇస్లామిక్ మత విశ్వాసానికి సంబంధించిన విషయాలను చదవాలని సూచనలు ఉండడం గమనించామని చెప్పారు. దీనిపై ప్రశ్నించగా, అది పొరపాటున రాసినట్లు ఉపాధ్యాయురాలు చెప్పిందని తెలిపారు. మతపరమైన పాఠాలు ఐచ్ఛికంగా ఎంచుకున్న విద్యార్థులకు మాత్రమే బోధించాలే తప్ప అందరికీ తప్పనిసరి చేయడం సరికాదని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ ఘటనపై విద్యాశాఖ విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### బండి సంజయ్, వీహెచ్‌పీ ఆగ్రహం

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఈ ఘటనపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ పాఠశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై లౌకికవాద సంస్థలు ఎందుకు మౌనంగా ఉన్నాయి? అని ప్రశ్నించారు. 2028లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే హిందూ విద్యార్థులందరికీ తిలకం ధరించడం తప్పనిసరి చేస్తామని వ్యాఖ్యానించారు. వీహెచ్‌పీ నాయకుడు రవినూతల శశిధర్ మాట్లాడుతూ, సంబంధిత పాఠశాలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుని, అవసరమైతే గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

# క్షీరాభిషేకాలు, జలాభిషేకాలు వద్దు

- బుల్డోజర్లతో దండలకూ నిషేధం
- నేతలపై అభిమానాన్ని ఆహార వృథా రూపంలో చాటుకోవద్దు
- పాలకు బదులు పేదలకు ఆహార పదార్థాలు పంపిణీ చేయాలి
- భారీ యంత్రాలతో దండలు వేస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవు
- ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్

**ప్రజానావ, హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో నేతలపై అభిమానాన్ని ప్రదర్శించే పేరుతో నిర్వహిస్తున్న పాలాభిషేకాలు, జలాభిషేకాలకు పూర్తిగా స్వస్తి పలకాలని తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ పార్టీ శ్రేణులకు ఆదేశాలు జారీ చేశారు. ఇదే విధంగా నాయకులకు భారీ పూలదండలు వేయడానికి బుల్డోజర్లు, జేసీబీలు వంటి భారీ యంత్రాలను వినియోగించడాన్ని కూడా నిషేధిస్తూ కఠిన ఆదేశాలు వెలువరించారు. తెలంగాణ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు టీ. కుమార్‌రావు గురువారం విడుదల చేసిన సర్క్యులర్‌లో, పార్టీ నిర్వహించే ఏ కార్యక్రమంలో నైనా, ఏ సందర్భంలోనైనా నేతల చిత్రపటాలు లేదా ఫొటోలకు పాలాభిషేకం, జలాభిషేకం చేయరాదని స్పష్టం చేశారు. ఈ నిర్ణయం ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఆదేశాల మేరకే తీసుకున్నట్లు పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలందరూ ఈ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని సూచిం చారు. పాలు వంటి ఆహార పదార్థాలను అభిషేకాల కోసం వినియోగించడం కాంగ్రెస్ సిద్ధాంతాలకు, సామాజిక విలువలకు పూర్తిగా విరుద్ధమని సర్క్యులర్‌లో పేర్కొన్నారు. సమాజంలో ఇప్పటికీ పోషకాహార లోపంతో బాధపడుతున్న వారు ఉన్న నేపథ్యంలో, అలాంటి కార్యక్రమాల బదులుగా పేదలకు, అవసరమైన వారికి ఆహార పదార్థాలు పంపిణీ చేయడం ద్వారా సామాజిక బాధ్యతను చాటాలని పార్టీ సూచించింది.

### ఎట్టి పరిస్థితుల్లో సహించబోం

కొంతమంది నాయకులకు భారీ పూలదండలు వేయడానికి బుల్డోజర్లు, జేసీబీలు, ఇతర ఎర్త్‌మూవింగ్ యంత్రాలను ఉపయోగిస్తున్నట్లు పార్టీ దృష్టికి వచ్చినట్లు సర్క్యులర్‌లో పేర్కొన్నారు. అలాంటి యంత్రాలు అణచివేతకు ప్రతీకలుగా భావిస్తున్నందున, ఇకపై పార్టీ కార్యక్రమాల్లో వాటిని వినియోగించడం సహించబోమని స్పష్టం చేశారు. ఈ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పార్టీ కార్యక్రమాలు ఆడంబరాలకు కాకుండా ప్రజలతో మమేకమయ్యేలా, సామాజిక బాధ్యతను ప్రతిబింబించేలా నిర్వహించాలని కాంగ్రెస్ అధిష్ఠానం స్పష్టం చేసింది. ఆహార వృథాను నివారిస్తూ, అవసరమైన వారికి సహాయం చేయడం ద్వారా పార్టీ విలువలను ఆచరణలో చూపించాలని కార్యకర్తలకు సూచించింది.

# తెలంగాణలో ఆషాఢ బోనాల సందడి

### ప్రజలకు సీఎం రేవంత్ శుభాకాంక్షలు

**ప్రజానావ, హైదరాబాద్ :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ మాస బోనాల మహోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. రాష్ట్ర సాంస్కృతిక వైభవానికి, ఆధ్యాత్మిక విశ్వాసానికి అద్దం పట్టే ఈ వేడుకల ప్రారంభం సందర్భంగా నగర ప్రజలకు, భక్తులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. బోనాల పండుగ సామాజిక ఐక్యతకు ప్రతీక అని కొనియాడిన ఆయన.. భక్తుల నమ్మకాలకు, సంప్రదాయాలకు భంగం కలగకుండా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది రూ.20 కోట్ల నిధులను కేటాయించిందని గుర్తుచేశారు. ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో ఈ ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలు పొందాలని 'ఎక్స్' వేదికగా ఆకాంక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. త్సవాల నిర్వహణలో భాగంగా దేవాలయాల పరిసరాల్లో పారిశుధ్యం, నిరంతర తాగునీటి సరఫరా, నిరంతరాయ విద్యుత్, వైద్య సేవలతో పాటు ట్రాఫిక్ నియంత్రణ, కట్టుదిట్టమైన భద్రత, అగ్నిమాపక సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని వేలాది ఆలయాల్లో భక్తుల రద్దీని తట్టుకునేందుకు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సీఎం ఇప్పటి ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ అధికారిక పర్యవేక్షణలో నేటి నుంచి ప్రారంభం కానున్న ఈ బోనాల జాతరను విజయవంతం చేసేందుకు సర్వం సిద్ధమైంది.

# రైతులకు నీళ్లు, విద్యుత్ ఇవ్వండి

- సాగునీరు, విద్యుత్ అంశాల్లో ప్రభుత్వం పూర్తిగా విఫలం
- విద్యుత్ ఉత్పత్తి పెంచి నాణ్యమైన బొగ్గు సరఫరా చేయాలి
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శ

**ప్రజానావ, హైదరాబాద్:** రాష్ట్రంలో సాగునీరు, విద్యుత్ సరఫరా అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభ ఉపనేత టి. హరీశ్‌రావు విమర్శించారు. రైతులకు తక్షణమే సాగునీరు, నాణ్యమైన విద్యుత్ అందించడంపై దృష్టి సారించాలని ప్రభుత్వానికి సూచించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మేడిగడ్డ బ్యారేజీ గేట్లు మూయకుండానే కన్నెపల్లి పంప్‌హౌస్ ద్వారా నీటిని ఎత్తిపోసే అవకాశం ఉందని రిటైర్డ్ ఇంజినీర్లు, సాగునీటి శాఖ నిపుణులు సూచిస్తే, అలాంటి సలహాలు ఇచ్చిన ఇంజినీర్లను జైలుకు పంపుతామని, బెల్టుతో కొడతామని ప్రభుత్వం బెదిరించడం దురదృష్టకరమని ఆరోపించారు. ప్రభుత్వం రాజకీయాలకు ప్రాధాన్యం ఇవ్వకుండా ప్రజల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, అవసరమైన సామర్థ్యం ఉన్నప్పటికీ నాణ్యమైన బొగ్గు సరఫరా లేక విద్యుత్ ఉత్పత్తి తగ్గిపోయిందన్నారు. వెంటనే బొగ్గు సరఫరాను మెరుగుపరచి విద్యుత్ ఉత్పత్తిని పెంచాలని, రైతులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని డిమాండ్ చేశారు. రైతులకు సరిపడా విద్యుత్ ఇవ్వకపోగా ఇప్పుడు వ్యవసాయ భూములపై పన్ను విధించే ఆలోచన ప్రభుత్వం చేస్తోందని హరీశ్‌రావు ఆరోపించారు. కమిషన్ల కోసమే గ్రీన్ ఎనర్జీ పాలసీని ప్రభుత్వం నిలిపివేసిందని విమర్శించారు.

### ప్రభుత్వానివి కోతలు, వాయిదాలే..

దేవాదుల ప్రాజెక్టుకు నీరు అందే పరిస్థితి గత ప్రభుత్వ హయాంలోనే ఏర్పడిందని, ప్రస్తుత ప్రభుత్వం మాత్రం కోతలు, వాయిదాలు తప్ప అభివృద్ధి పనులు చేపట్టడం లేదని అన్నారు. రైతులకు నీళ్లు ఇవ్వాలని అడిగితే రక్తం పారిస్తామని అధికార పార్టీ నేతలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. రెండు పంటలకు బోనస్ ఇస్తామని చెప్పి ప్రభుత్వం మాట తప్పిందన్నారు. విద్యుత్ సమస్యలతో రైతులు ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో 7,180 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఉన్నప్పటికీ ప్రస్తుతం కేవలం 3,100 మెగావాట్ల విద్యుత్ మాత్రమే ఉత్పత్తి అవుతోందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని రిజర్వాయర్లలో నీటి నిల్వ లు కేవలం 33 శాతం మాత్రమే ఉన్నాయని, ఎల్‌నినో ప్రభావం ఉంటుందని ముందే తెలిసినా ప్రభుత్వం ఎలాంటి ముందస్తు కార్యాచరణ చేపట్టలేదని ఆరో పించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రైతులతో పాటు పారిశ్రామిక వేత్తలు, సాధారణ ప్రజలు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని హరీశ్‌రావు విమర్శించారు.

# భక్తజన సంద్రం.. జగన్నాథ రథయాత్ర

(మొదటిపేజీ తరువాయి)

మంగళవారం నుంచి ఇప్పటివరకు 233 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. శుక్రవారం కూడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

### భారీ భద్రతా ఏర్పాట్లు

రథయాత్ర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకో కుండా రాష్ట్ర ప్రభుత్వం పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేసింది. 19 మంది ఐపీఎస్ అధికారులు, దాదాపు 13 వేల మంది పోలీసు సిబ్బంది విధుల్లో ఉన్నారు. అదనంగా సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, ఆర్‌ఏఎఫ్, నేషనల్ సెక్యూరిటీ గార్డు బలగాల 15 కంపెనీలను కీలక ప్రాంతాల్లో మోహరించారు. గ్రాండ్ రోడ్డుతో పాటు పరిసర ప్రాంతాల్లో 473 ఏఐ ఆధారిత సీసీటీవీ కెమెరాలు, డ్రోన్ జామింగ్ వ్యవస్థలు, రెండు కమాండ్ అండ్ కంట్రోల్ కేంద్రాల ద్వారా నిరంతర నిఘా కొనసాగుతోంది.



సముద్ర తీరంలో భారత నౌకాదళం, కోస్ట్‌గార్డు, ఒడిశా మెరైన్ పోలీసుల సంయుక్త గస్తీతో పాటు 500 మందికి పైగా లైఫ్‌గార్డులు, అగ్నిమాపక సిబ్బందిని కూడా మోహరించి భక్తుల భద్రతను పటిష్ఠం చేశారు.

# మా హయాంలోనే ప్రాజెక్టులు పూర్తిచేస్తాం

(మొదటిపేజీ తరువాయి)

స్పష్టం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని సత్తుపల్లి టన్నెల్ వద్ద సీతారామ ప్రాజెక్టు పనులను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి పరిశీలించిన అనంతరం నిర్వ హించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడా రు. దివంగత ముఖ్యమంత్రి డా.వై.ఎస్. రాజశేఖరరెడ్డి ప్రారంభించిన డా. బీఆర్. అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టును మళ్లీ వేగవంతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంద ని తెలిపారు. గత ప్రభుత్వం పర్యావరణ అనుమతులు లేకుండా నే సీతమ్మసాగర్ ప్రాజెక్టు పనులు ప్రారంభించడం వల్ల న్యాయ పరమైన ఇబ్బందులు తలెత్తాయని గుర్తుచేశారు. ప్రస్తుతం సు ప్రీంకోర్టులో ప్రభుత్వం సమర్థంగా వాదనలు వినిపిస్తోందని, అవసరమైన అన్ని కేంద్ర అనుమతులు పొందిన అనంతరం చట్టబద్ధంగా పనులు పూర్తిచేస్తామని చెప్పారు. సీతారామ ప్రాజె క్టుకు అవసరమైన 67 టీఎంసీల గోదావరి జలాల వినియోగానికి కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) తుది అనుమతివ్వడం కాంగ్రెస్ ప్రభుత్వానికి పెద్ద విజయమని మంత్రి పేర్కొన్నారు. దీంతో ప్రాజెక్టు నిర్మాణ పనులు మరింత వేగవంతమవుతాయని చెప్పారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ప్రతి ఎకరాకు గోదావరి జలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. భూసేకరణ, పర్యావరణ అనుమతులు, సాంకేతిక అంశాలకు సంబంధించిన సమస్యలను వేగంగా పరిష్కరించి ప్రాజెక్టులను పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులు జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ సూచనల మేరకు అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో కొనసాగుతున్నాయని తెలిపారు. అన్ని పరీక్షలు పూర్తై భద్రతా ధ్రువీకరణ లభించిన తర్వాతే బ్యారేజీలను తిరిగి వినియోగంలోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు.

### యాసంగిలో 82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

కాళేశ్వరం బ్యారేజీల్లో నీటిని నిల్వ చేయకుండానే తెలంగాణ రైతులు రికార్డు స్థాయిలో పంటలు పండించారని మంత్రి పేర్కొన్నారు. యాసంగి సీజన్‌లో సుమారు 82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి దాదాపు రూ.19 వేల కోట్లను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదేనని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు ద్వారా రైతులకు రూ.80 వేల కోట్లకు పైగా నేరుగా చెల్లించినట్లు వెల్లడించారు. నీటి పారుదల శాఖను మరింత బలోపేతం చేసేందుకు వెయ్యికి పైగా ఇంజినీర్లను, దాదాపు 1,800 మంది ఫీల్డ్ సిబ్బందిని నియమించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న పదోన్నతులను కూడా మంజూరు చేశామని మంత్రి తెలిపారు. రైతుల శాశ్వత ప్రయోజనాలు, ప్రజల భద్రతను దృష్టిలో పెట్టుకుని శాస్త్రీయ ప్రమాణాల ఆధారంగానే ప్రతి సాగునీటి ప్రాజెక్టును పూర్తి చేస్తామని ఉత్తమ్‌కుమార్ రెడ్డి పునరుద్ఘాటించారు.

## గోదావరి జలాలతో ఖమ్మంను సస్యశ్యామలం చేస్తాం

- వేగంగా సీతారామ, సీతమ్మసాగర్ పనులు
- డిప్యూటీ సీఎం భట్టి

**ప్రజానావ, భద్రాద్రి కొత్తగూడెం:** గోదావరిలో ప్రవహిస్తున్న జలాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చి ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గోదావరి జలాలను ప్రతి సాగుభూమికి అందించి రైతాంగాన్ని ఆదుకుంటామని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలో గోదావరి నదిపై నిర్మితమవుతున్న చివరి ప్రధాన ప్రాజెక్టు అయిన సీతారామను త్వరితగతిన పూర్తి చేసి నీటిని గరిష్ఠంగా వినియోగంలోకి తీసుకొస్తామని వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలోని సీతమ్మసాగర్, సీతారామ ప్రాజెక్టు పనులను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. అనంతరం గోదావరి తీరంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి దుమ్ముగూడెం రాజీవ్‌సాగర్, రుద్రంకోట ఇందిరాసాగర్ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసి ప్రణాళికలు రూపొందించారని గుర్తుచేశారు. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం రీడిజైనింగ్ పేరుతో తక్కువ వ్యయంతో పూర్తయ్యే ప్రాజెక్టుల అంచనా వ్యయాన్ని భారీగా పెంచి రాష్ట్ర ఖజానాపై అదనపు భారం మోపిందని ఆరోపించారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టులపై ఇప్పటికే భారీగా ప్రజాధనం ఖర్చు కావడంతో వాటిని నిలిపివేయడం సాధ్యం కాదని, అందుకే పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో సీతారామ ప్రాజెక్టును పూర్తి చేసి గోదావరి జలాలను రైతులకు అందించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. గోదావరిపై నిర్మాణంలో ఉన్న చివరి ప్రాజెక్టు కావడంతో సీతారామకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని భట్టి పేర్కొన్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో ఒక్క రూపాయి కూడా వృథా కాకుండా పారదర్శకంగా పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

# గోల్కొండ గుట్టపై బోనాల సందడి

(మొదటిపేజీ తరువాయి)

విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, సాంస్కృతిక కళాకారుల ప్రదర్శనల నడుమ తొలి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కళాకారుల అభ్యర్థన మేరకు మంత్రి కొండా సురేఖ ఈరగోల చేతబట్టి వారిని ఉత్సాహపరిచారు. ఆషాఢ బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని సాంస్కృతిక శాఖ రూపొందించిన ప్రత్యేక బుక్‌లెట్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి మంత్రి సురేఖ ఆవిష్కరించారు. అలాగే గోల్కొండ జగదాంబిక ఆలయ కమిటీకి రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.11 లక్షల ఆర్థిక సాయానికి సంబంధించిన చెక్కును ఇరువురు మంత్రులు అందజేశారు.

### హైదరాబాద్‌కు ప్రత్యేక శోభ

ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరికీ ఆషాఢ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక వారసత్వానికి ప్రతీకగా నిలిచిన బోనాల ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత వైభవంగా నిర్వహిస్తోందని పేర్కొన్నారు. డప్పు చప్పుళ్లు, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలతో హైదరాబాద్ నగరం పండుగ శోభను సంతరించుకుందని అన్నారు. గోల్కొండ జగదాంబిక అమ్మవారికి బోనాలు సమర్పించడం ద్వారా ఎల్‌నినో ప్రభావం తగ్గి, భూమాత శాంతించి రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, తెలంగాణ అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్నే ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తోందని తెలిపారు. బోనాల ఉత్సవాల సందర్భంగా పెద్ద దేవాలయాలతో పాటు చిన్న దేవాలయాలకు కూడా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందని మంత్రి వెల్లడించారు. భక్తులు ఎలాంటి అసౌకర్యం లేకుండా అమ్మవారిని దర్శించుకునేలా అన్ని శాఖల సమన్వయంతో సమగ్ర ఏర్పాట్లు చేసినట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్, తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, దేవాదాయ శాఖ ప్రధాన కార్యదర్శి శైలజా రామయ్యర్, దేవాదాయ శాఖ డైరెక్టర్ హనుమంతరావు, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, గోల్కొండ జగదాంబిక ఆలయ కమిటీ చైర్మన్ ఆకుల చంద్రశేఖర్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

### గోల్కొండ అమ్మవారిని దర్శించుకున్న ఎంపీ ఈటల రాజేందర్

తెలంగాణలో బోనాల సందడి మొదలయ్యింది. హైదరాబాద్‌లో బోనాల జాతర గురువారం ప్రారంభమైంది. డప్పు చప్పుళ్లు.. శివసత్తుల పూనకాలు.. పోతురాజుల విన్యాసాల నడుమ సంప్రదాయ వస్త్రాల్లో మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో బోనాలు ఎత్తుకుని ఆలయాలకు కదిలే తరుణం వచ్చేసింది. తెలంగాణ సంస్కృతి సంప్రదాయ వైభ వాన్ని ప్రతిబింబించే బోనాల ఉత్సవాలు గోల్కొండ కోటలో ప్రారంభం అయ్యాయి. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ వేడుకల కోసం.. హైదరాబాద్, రంగారెడ్డి, మల్కాజిగిరి పరిధిలోని సుమారు 3 వేలకు పైగా దేవాలయాల్లో అట్టహాసంగా నిర్వహించేంద కు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. ఆషాఢ మాస బోనాల పండుగ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ నేత ఈటల రాజేందర్ గురువారం గోల్కొం డ కోటలోని శ్రీశ్రీశ్రీ జగదంబ మహంకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మొక్కులు చెల్లించుకుని తెలంగాణ ప్రజలందరికీ ఆషాఢ మాస బోనాల శుభాకాంక్షలు తెలిపారు. సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఈటల రాజేందర్.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీక అని అన్నారు. వందల ఏళ్లుగా కొనసాగుతున్న ఈ సాంప్రదాయంలో వర్షాకాలం ప్రారంభమైన తర్వాత ఆషాఢ మాసంలో తెలంగాణ రాష్ట్రంలోనే తొలి బోనాన్ని కుమ్మర సమాజానికి చెందిన మహిళలు గోల్కొండ జగదంబ మహంకాళి అమ్మవారికి సమర్పించడం ఆనవాయితీగా వస్తోందని చెప్పా రు. ఆషాఢ మాస బోనాల పండుగ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులతో తెలంగాణ ప్రజలు సుఖశాంతులు, సస్యశ్యామలతతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.



# ముఖ్యమంత్రి బ్రేక్ ఫాస్ట్ స్కీమ్ కోసం భవనాల పరిశీలన

**అధికారులతో కలిసి పరిశీలించిన జిల్లా కలెక్టర్**

**ప్రజానావ, సిరిసిల్ల :** రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న సీఎం బ్రేక్ ఫాస్ట్ స్కీమ్ కోసం జిల్లాలోని పలు భవనాలను అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ గురువారం పరిశీలించారు. ప్రభుత్వ విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థులకు ఉదయం వేళలో సీఎం బ్రేక్ ఫాస్ట్ స్కీమ్ కింద అల్పాహారం, పాలు అందించే కార్యక్రమంలో భాగంగా ఆహార పదార్థాలు సిద్ధం చేసేందుకు సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లోని పలు భవనాలను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, హరే కృష్ణ మూవ్మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ (హెచ్ కే ఎం సీ ఎఫ్) బాధ్యులు గురువారం పరిశీలించారు. పరిశీలనలో సిరిసిల్ల, వేములవాడ తహసీల్దార్లు మహేష్, జయంత్, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, లోకేష్ పాల్గొన్నారు.

# స్వయం ఉపాధి అవకాశాలతో ఆర్థికంగా ఎదగాలి

- మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు పెంపొందించుకుని ఉపాధి అవకాశాలను సృష్టించుకోవాలి
- ప్రభుత్వం శిక్షణ, రుణాలు అందిస్తుంది.. విజయవంతం చేయాల్సిన బాధ్యత లబ్ధిదారులదే
- కలెక్టర్ కోయ శ్రీహర్ష




**ప్రజానావ, పెద్దపల్లి :** స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ స్వయం ఉపాధి శిక్షణలో తొలి బ్యాచ్‌లో 1,200 మంది శిక్షణ పొందడం అభినందనీయమని తెలిపారు. తొలి బ్యాచ్ సాధించిన విజయాలు మరింత మందికి స్ఫూర్తిగా నిలిచి స్వయం ఉపాధి వైపు అడుగులు వేయడానికి దోహదపడతాయని పేర్కొన్నారు. మహిళలు తమ ప్రతిభను, నైపుణ్యాలను పరిమితం చేసుకోకుండా సృజనాత్మకంగా ఆలోచిస్తూ కొత్త అవకాశాలను అన్వేషించాలని సూచించారు. సంప్రదాయ కోర్సులకే పరిమితం కాకుండా మార్కెట్‌లో డిమాండ్ ఉన్న రంగాల్లో నైపుణ్యాలు పెంపొందించుకుని స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకోవాలని తెలిపారు. మార్కెట్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని వ్యాపారాలు ప్రారంభించాలని, ఇద్దరు లేదా ముగ్గురు కలిసి చిన్న తరహా యూనిట్లను ఏర్పాటు చేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల విస్తరణ కోసం తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్), వీ–హబ్‌తో అవసరమైన అనుసంధానాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. టామ్‌కామ్ ద్వారా విదేశాల్లో కూడా ఉపాధి అవకాశాలు ఉన్నాయని, ముఖ్యంగా జర్మనీ, జపాన్ దేశాల్లో నర్సులకు అధిక డిమాండ్ ఉందని తెలిపారు. ఆసక్తి ఉన్న వారికి అవసరమైన శిక్షణ అందిస్తామని వెల్లడించారు. ప్రభుత్వం తరపున శిక్షణ, తక్కువ వడ్డీపై రుణాలు, ఇతర సహాయ సహకారాలు అందిస్తామని, అయితే వ్యాపారాన్ని విజయవంతంగా నిర్వహించాల్సిన బాధ్యత లబ్ధిదారులదేనని కలెక్టర్ స్పష్టం చేశారు. యూనిట్‌పై పూర్తి యాజమాన్య భావనతో పనిచేస్తేనే విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా ఎదగగలరని అన్నారు. స్వయం ఉపాధి ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించేలా అవసరమైన నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక సహాయం, ఇతర మద్దతును జిల్లా యంత్రాంగం అందిస్తుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీజీఎం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నట్రాజ్, ఎల్.డి.ఎం. ప్రవీణ్ కుమార్, ఏపీ డి.రవీందర్, డి.పి.ఎం.రమణ, ఆర్.శెట్టి, డైరెక్టర్ వెంకటేష్, సంబంధిత శాఖల అధికారులు, యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ప్రతినిధులు, శిక్షణ పొందిన అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడలో యువకుడి మృతి

**ప్రజానావ, వేములవాడ :** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సాయి నగర్‌లో ఓ యువకుడు మృతి చెందిన విషాద ఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాయి నగర్‌కు చెందిన బాలసాని హేమంత్ (24) గత నాలుగేళ్లుగా ఆస్తమా, ఛాతీ నొప్పి వంటి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఆరోగ్య సమస్యల కారణంగా తీవ్ర మనస్తాపానికి గురైన ఆయన, జూలై 15 రాత్రి తన నివాసంలో మృతి చెందినట్లు గుర్తించారు. హేమంత్‌కు 18 రోజుల క్రితమే కుమారుడు జన్మించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి తండ్రి బాలసాని మల్లేశం గౌడ్ ఫిర్యాదు మేరకు వేములవాడ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా వేములవాడ టౌన్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ, అనారోగ్య సమస్యలు, మానసిక ఒత్తిడి లేదా జీవితంపై నిరాశతో బాధపడుతున్న వారు ఒంటరిగా ఉండకుండా కుటుంబ సభ్యులు, స్నేహితులు లేదా వైద్య నిపుణులతో మాట్లాడాలని సూచించారు.

# రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

- ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పకడ్బందీగా భూముల సర్వే
- రైతులు రీ–సర్వే సమయంలో అందుబాటులో ఉంటూ పూర్తి సహకారం అందించాలి
- కలెక్టర్ కోయ శ్రీహర్ష



**ప్రజానావ, పెద్దపల్లి :** భూ భారతి కింద చేపడుతున్న రీ–సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించి, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. గురువారం పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామ సభ లో భూభారతి – రీ–సర్వే అవగాహన సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి పోర్టల్ ద్వారా ఇప్పటికే అనేక భూ సమస్యలు పరిష్కారమయ్యాయని తెలిపారు. భూముల విస్తీర్ణంలో తేడాలు, ఇతర భూ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం రీ–సర్వే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో చివరిసారిగా 1937లో భూ సర్వే జరిగిందని, ప్రస్తుతం ప్రభుత్వం అన్ని గ్రామాల్లో సమగ్ర రీ–సర్వే నిర్వహించాలని ఆదేశించిందని తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో మొత్తం 190 రెవెన్యూ గ్రామాలు ఉండగా, మొదటి దశలో 70 గ్రామాలను రీ–సర్వే కోసం ఎంపిక చేసినట్లు, అందులో సబ్బితం గ్రామం కూడా ఒకటని పేర్కొన్నారు. రీ–సర్వేలో భాగంగా ముందుగా గ్రామ సరిహద్దులను నిర్ధారించి, అనంతరం ఇళ్లు, ప్రభుత్వ ఆస్తులు, వ్యవసాయ భూములను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సర్వే చేస్తామని తెలిపారు. సర్వే ప్రక్రియను ఆధునిక యంత్రాల సహాయంతో పూర్తి స్థాయిలో నిర్వహిస్తామని వెల్లడించారు. సర్వే అనంతరం గ్రామాల్లో భూ వివరాలను ప్రకటించి ప్రజలకు 21 రోజుల గడువు ఇస్తామని, అభ్యంతరాలు స్వీకరించి పరిష్కరించిన తర్వాత వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి భూధార్ కార్డులు జారీ చేస్తామని కలెక్టర్ తెలిపారు. పైలెట్ ప్రాజెక్టు కింద రాష్ట్రంలోని ఐదు గ్రామాల్లో నిర్వహించిన రీ–సర్వే ద్వారా 99 శాతం సమస్యలు పరిష్కారమయ్యాయని తెలిపారు. గ్రామాల్లో రీ–సర్వే జరుగుతున్న సమయంలో ప్రజలు అందుబాటులో ఉంటూ అధికారులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. రోజుకు సుమారు 40 నుంచి 50 ఎకరాల వరకు సర్వే నిర్వహిస్తామని, ఏ భూములను సర్వే చేయనున్నారనే సమాచారాన్ని ముందుగానే అందిస్తామని, సంబంధిత రైతులు నిర్దేశిత సమయంలో తమ భూముల వద్ద అందుబాటులో ఉండాలని సూచించారు. రీ–సర్వే ద్వారా రూపొందించే భూ వివరాలు రాబోయే 60 నుంచి 70 సంవత్సరాల వరకు ఉపయోగపడేలా ఉంటాయని కలెక్టర్ తెలిపారు. ఆధార్ తరహాలో భూధార్ కార్డుల జారీకి ఈ రీ–సర్వే కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రాజయ్య, సర్పంచ్ నూనె సరోజన, సర్వేయర్ లు,రెవెన్యూ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# పొత్తూరు మానేరు బ్రిడ్జిపై మహాధర్నా

- ఖాళీ బిందెలతో నిరసన, రాస్తారోకో
- మిడ్ మానేరు నీటి విడుదలకు డిమాండ్

**ప్రజానావ, సిరిసిల్ల :** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం పొత్తూరు మానేరు వంతెన పై బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఇల్లంతకుంట మండలంలోని పొత్తూరు బ్రిడ్జిపై మిడ్ మానేర్ రిజర్వాయర్ (ఎంఎంఆర్) నుంచి వెంటనే నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ మహాధర్నా నిర్వహించారు. మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేయగా, రైతులు, బీఆర్ఎస్ నాయకులు ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిరిసిల్ల మాజీ జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు మాట్లాడుతూ, మిడ్ మానేర్ నుంచి నీటిని విడుదల చేయడంతో పాటు కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి పంప్ హౌస్ మోటార్లను వెంటనే ప్రారంభించి ఎత్తిపోతలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రాస్తారోకో నిర్వహించారు. దీనితో కొంతసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బందోబస్తు నిర్వహించారు. ఈ మహాధర్నాలో బోయినపల్లి మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, మహిళలు పాల్గొన్నారు.



# ఆలయానికి దారి సుగమం

**కట్ట మైసమ్మ ఆలయ సూచిక బోర్డు ఏర్పాటు**

**ప్రజానావ, హైదరాబాద్:** బంజారాహిల్స్ రోడ్ నంబర్–1లోని అంతిగాని కుంట కట్టపై ఉన్న వందేళ్ల పురాతన శ్రీ కట్ట మైసమ్మ ఆలయానికి వచ్చే భక్తులకు ఇకపై ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ మేయర్ గద్వాల విజయలక్ష్మి సూచనల మేరకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ హోటల్ యాజమాన్యంతో చర్చించి, ఆలయానికి వచ్చే మార్గాన్ని భక్తులు, హోటల్ యాజమాన్యం ఉమ్మడిగా వినియోగించుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రేమ్‌నగర్ పంచాయతీ కమిటీ ఆధ్వర్యంలో ఆలయం ఉన్నట్లు సూచించే బోర్డును ఏర్పాటు చేశారు. ప్రస్తుతం తాజ్ బంజారా హోటల్‌ను కొనుగోలు చేసిన అరబిందో డెవలపర్స్ ఆలయ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు ఆలయ కమిటీ చైర్మన్ దాసరి విశ్వనాథ్, అధ్యక్షుడు గనుమల రామచందర్ తెలిపారు. బోనాల పండుగ అనంతరం ఆలయ పునర్నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు.



# బోనాల ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి

**తార్నాకలో పారిశుద్ధ్య, భద్రతా పనుల పరిశీలన**

**ప్రజానావ, హైదరాబాద్:** ఆషాఢ బోనాల జాతరతో పాటు వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని తార్నాక డివిజన్‌లో ప్రత్యేక పారిశుద్ధ్య, మౌలిక వసతుల పనులు చేపట్టినట్లు గ్రేటర్ హైదరాబాద్ మాజీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యుడు మోతే శోభన్ రెడ్డితో కలిసి డివిజన్‌లో పర్యటించి రహదారుల మరమ్మతులు, వీధిదీపాల నిర్వహణ, ప్రమాదకర చెట్ల కొమ్మల తొలగింపు, పారిశుద్ధ్య నిర్వహణ, డ్రైనేజీ సమస్యల పరిష్కార పనులను పరిశీలించారు. బోనాల సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే నేపథ్యంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించగా, అధికారులు వెంటనే ప్రమాదకర చెట్ల కొమ్మల తొలగింపు పనులు ప్రారంభించారు. బోనాల జాతర తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉత్సవాల్లో పాల్గొనేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని శ్రీలత శోభన్ రెడ్డి సూచించారు. ప్రజల భద్రత, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధిదీపాలు, రహదారుల నిర్వహణలో నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని పేర్కొన్నారు.

# కాళేశ్వరం పంపులు ప్రారంభించి చెరువులను నింపాలి

- బీఆర్ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి చిరుమల్ల రాకేష్ కుమార్ డిమాండ్




**ప్రజానావ, పెద్దపల్లి :** ఉత్తర తెలంగాణలో సాగునీటి ఎద్దడి తీవ్రరూపం దాల్చుతోందని, ఎండిపోయిన చెరువులను నింపేందుకు ప్రభుత్వం తక్షణమే కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి పంపులను ప్రారంభించాలని బీఆర్ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి చిరుమల్ల రాకేష్ కుమార్ డిమాండ్ చేశారు. పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాల వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దపల్లి ప్రాంతంలో ఎల్లమ్మ చెరువు సహా అనేక చెరువులు పూర్తిగా ఎండిపోవడంతో రైతులు నాట్లు వేయలేక అల్లాడుతున్నారని రాకేష్ కుమార్ పేర్కొన్నారు. డీ–83, డీ–86 కాలువల ద్వారా నీటి సరఫరా నిలిచిపోవడంతో సాగునీటి సమస్య జటిలమైందని తెలిపారు. గత ఏడాది ఇదే సమయానికి జిల్లాలో 2.79 లక్షల ఎకరాల్లో సాగు జరగగా, ఈసారి కేవలం 12 వేల ఎకరాలకు మాత్రమే పరిమితమైందని గణాంకాలను వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమస్యల పరిష్కారం కంటే బీఆర్ఎస్ నాయకులను విమర్శించడానికే ప్రాధాన్యత ఇస్తోందని ఆయన మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు ప్రెస్‌మీట్లతో కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. రక్తాలతోనే పంటలు పండుతాయి అనుకుంటే, ఎవరి రక్తం వాడాలో ప్రజలే నిర్ణయిస్తారని అంటూ రాకేష్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పెద్దపల్లి రిజర్వాయర్ నిర్మాణాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని, రెండేళ్లు గడిచినా కనీసం పనులు ప్రారంభించలేదని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతుల విషయంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు చేసిన సవాల్‌ను ప్రభుత్వం స్వీకరించాలని, అవసరమైతే నిర్వహణ బాధ్యతలను తమకు అప్పగించాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే విజయరమణరావు పెద్దపల్లి సాగు పరిస్థితిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే శ్రీధర్ బాబు తండ్రి పేరుతో ఉన్న శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటిని నింపాలని కోరారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు సామర్థ్యం 20 టీఎంసీలు కాగా, ప్రస్తుతం కేవలం 7 టీఎంసీల నీరు మాత్రమే ఉందని ఆయన వెల్లడించారు. తాగునీటి అవసరాలు, ఎన్టీపీసీ అవసరాలను దృష్టిలో ఉంచుకుంటే, సాగునీటికి తీవ్ర కొరత తప్పదని హెచ్చరించారు. గోదావరిలో నీటి ప్రవాహం తగ్గిపోతున్న ప్రస్తుత పరిస్థితుల్లో, ప్రభుత్వం అత్యవసరంగా చర్యలు చేపట్టి శ్రీపాద ప్రాజెక్టు నింపి, ఆ నీటిని చెరువులకు తరలించాలని కోరారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా వ్యవసాయ శాఖ అధికారులు ఆరుతడి పంటలు వేయాలని సూచిస్తున్నారని, ఇది రాష్ట్రంలో నెలకొన్న సాగునీటి ఎద్దడికి నిదర్శనమని రాకేష్ కుమార్ అన్నారు. రాజకీయ విమర్శలు మానుకొని, క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. లేనిపక్షంలో భవిష్యత్తులో తాగునీటి సమస్య కూడా తలెత్తే ప్రమాదం ఉందని, రైతులు ఎదుర్కొంటున్న కష్టాలకు ప్రభుత్వం బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని బస్టాండ్ దగ్గర గల ప్రెస్ క్లబ్ లో జరిగిన టిఎస్ మాజీ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చిరుమిల్ల రాకేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రెస్ మీట్ లో పాల్గొన్న బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఉప్పు రాజ్ కుమార్, మాజీ వైస్ చైర్మన్ మోబిన్, మాజీ కౌన్సిలర్ స్వామి, ఉప సర్పంచ్ మేకల కుమార్ యాదవ్, సీనియర్ నాయకులు కర్రె దేవేందర్ రెడ్డి, పదాల రాజేష్ గౌడ్, పోసాని శ్రీనివాస్ యాదవ్, ఉప్పు శివ కుమార్, బోయిని మహేష్, కంది నాగరాజ్ , పాయిలి కిరణ్, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# టీటీడీ తరహాలో యాదాద్రిలో భక్తులకు మెరుగైన సేవలు

- పాలనా విధానాలు, దర్శన వ్యవస్థ, ఐటీ సేవల అధ్యయనానికి తిరుమలలో యాదాద్రి అధికారుల బృందం

**ప్రజానావ, యాదగిరిగుట్ట:** తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు యాదాద్రి శ్రీ లక్ష్మి నరసింహస్వామి దేవస్థానంలో భక్తులకు మరింత నాణ్యమైన, పారదర్శకమైన సేవలు అందించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అమలు చేస్తున్న పాలనా విధానాలు, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను అధ్యయనం చేసేందుకు యాదాద్రి దేవస్థానం అధికారుల బృందం గురువారం తిరుమలను సందర్శించింది. యాదాద్రి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి జే. భవానీ శంకర్ నేతృత్వంలోని ఈ బృందంలో ఏఈవో జీ. రఘు, సూపరింటెండెంట్లు ఎం. రాజన్ బాబు, డి. నరేష్ పాల్గొన్నారు. తిరుమలలోని శ్వేతా భవనంలో టీటీడీ అదనపు కార్యనిర్వాహణాధికారి వెంకయ్య చౌదరితో సమావేశమైన అధికారులు, దాతలకు అందిస్తున్న సేవలు, డోనర్ ఫెసిలిటీ సెంటర్ నిర్వహణ, భక్తులకు త్వరిత దర్శనం కల్పించే విధానాలపై సమగ్ర వివరాలు తెలుసుకున్నారు. అనంతరం టీటీడీ జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఏ. శరత్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో టీటీడీ జనరల్ మేనేజర్ (ఐటీ) బి. వేంకటేశ్వర నాయుడు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా టీటీడీ పరిపాలన, సేవా విధానాలపై విస్తృతంగా వివరించారు. శ్రీవారి దర్శన వ్యవస్థ, అన్నప్రసాదాల పంపిణీ, వసతి నిర్వహణ, కళ్యాణకట్ట సేవలు, క్యూలైన్ నిర్వహణ, ఐటీ సేవలు, ధార్మిక కార్యక్రమాలు, విద్యా సంస్థలు, వైద్య సేవలు, విజిలెన్స్, క్రౌడ్ మేనేజ్‌మెంట్, కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్, పారిశుధ్య నిర్వహణ, పచ్చదనం అభివృద్ధి, గోశాల నిర్వహణ, ప్రసాదాల తయారీ వంటి అంశాలపై అధికారులకు అవగాహన కల్పించారు. అలాగే టీటీడీ బోర్డు సమావేశాల నిర్వహణ, అజెండా రూపకల్పన, తీర్మానాలు, సమావేశ మినిట్స్ తయారీ, వెబ్‌సైట్ నిర్వహణ, బోర్డు చట్టాలు, దేవాదాయ శాఖ చట్టాల అమలుపై డిప్యూటీ ఈవో ప్రశాంతి వివరించారు. ప్రారంభ సమావేశంలో శ్వేతా డైరెక్టర్ డా. వేమా వెంకటరత్నం మాట్లాడుతూ, 2002లో స్థాపించబడిన శ్వేతా సంస్థ ద్వారా టీటీడీ ఉద్యోగులకు ఆలయ పరిపాలన, సేవా దృక్పథం, సనాతన ధర్మ ప్రచారం, కార్యాలయ నిర్వహణ, ఆర్థిక నిర్వహణ, ఈ-ఆఫీస్ విధానం, మహిళల రక్షణకు సంబంధించిన చట్టాలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి ఆధునిక అంశాలపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్వేతా ఏఈవో అరుణాదేవి, బోర్డు సెల్ ఏఈవో సునీల్, డిపిపి ఏఈవో సత్యనారాయణ, సూపరింటెండెంట్లు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ హయాంలో అవినీతి

- కేసీఆర్ పాలనలోనే సీతారామ ప్రాజెక్టుకు ఊపిరి
- బీఆర్ఎస్ ప్రభుత్వ పనులను తమ ఘనతగా చెప్పుకోవడం సరికాదు
- మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్



**ప్రజానావ, ఖమ్మం:** ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతాంగ సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని సీతారామ ప్రాజెక్టును సాకారం చేసిన దార్శనికుడు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పేర్కొన్నారు. గురువారం ఖమ్మంలో మీడియాతో మాట్లాడిన ఆయన, కాంగ్రెస్ పాలనలో అవినీతి, అక్రమాలకు నిలయాలుగా మారిన ప్రాజెక్టులకు బీఆర్ఎస్ ప్రభుత్వం పునర్జీవం పోసిందని అన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ మంత్రులు తమ వంతు కృషి ఏమీ లేకపోయినా, బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను తమ ఖాతాలో వేసుకుంటూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో జలయజ్ఞం పేరుతో వేల కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగమైందని, మొబిలైజేషన్ అడ్వాన్స్‌ల పేరిట ఇందిరా సాగర్, రాజీవ్ సాగర్ ప్రాజెక్టులు అవినీతి, అక్రమాలకు కేంద్రాలుగా మారాయని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం కేసీఆర్ ప్రభుత్వం ఆ ప్రాజెక్టులను సమగ్రంగా పునర్వ్యవస్థీకరించి సీతారామ ప్రాజెక్టుగా అభివృద్ధి పథంలోకి తీసుకువచ్చిందని తెలిపారు. గోదావరి జలాలను వినియోగించి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సుమారు 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రాజెక్టు పనులను వేగంగా పూర్తి చేసే దిశగా చర్యలు చేపట్టిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దాదాపు రూ.9 వేల కోట్లు వెచ్చించి 100 కిలోమీటర్లకు పైగా ప్రధాన కాలువలు, పంప్ హౌస్‌లు, పైప్‌లైన్లు, విద్యుత్ ట్రాన్స్‌మిషన్ వ్యవస్థలను నిర్మించడంతో పాటు భూసేకరణ, అటవీ, పర్యావరణ అనుమతులు వంటి క్లిష్టమైన సమస్యలను అధిగమించి ప్రాజెక్టును 90 శాతం వరకు పూర్తి చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలకు చెప్పుకునే అభివృద్ధి కార్యక్రమాలు లేకపోవడంతో కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తూ బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని, బీఆర్ఎస్ చేసిన పనులను తమ ఘనతగా ప్రచారం చేసుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. అయితే ఎవరి పాలనలో ఎంత అభివృద్ధి జరిగిందో ప్రజలకు స్పష్టంగా తెలుసని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పేర్కొన్నారు.

ప్రజానావ

**విలేకరులు కావలెను**

రెండు తెలుగు రాష్ట్రాల్లో వేగంగా విస్తరిస్తున్న తెలుగు దినపత్రిక ప్రజానావలో పని చేయుటకు మా సంస్థ ఆహ్వానం పలుకుతోంది

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాల్లో పనిచేయుటకు విలేకరులు కావలెను.

మండలాలు, అర్బన్, పట్టణ కేంద్రాల్లో పనిచేసే వారికి కనీస అర్హత ఇంటర్మీడియట్

స్టాఫ్ రిపోర్టర్, ఆర్‌సీ ఇన్‌చార్జిలకు కనీస అర్హత డిగ్రీ ఉండాలి

మీ బయోడేటాను ఇప్పుడే ఈ నెంబర్లకు వాట్సాప్ చేయండి

9948433277, 9014966169



# దేశంలో డీలిమిటేషన్ రాజకీయాలు!

ఈనెల 20 నుంచి పార్లమెంట్ సమా శాలు ప్రారంభం కానున్నాయి. దీంతో ఈసారి ఎలాగైనా గండం గట్టెందుకు అవసరమైన వ్యూహాలతో సిద్ధం అవుతోంది. ఆయా రాష్ట్రా ల్లోని రాజకీయాలను తనకు అనులంగా మార్చుకుని ముందుకు సాగబో తున్నట్లు తాజా పరిస్థితులు చెప్పకనే చెబుతున్నాయి. రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరని ఈ సమావేశాలు బహుశా నిరూపించనున్నాయి. వర్షాకాల పార్లమెంట్ సమావేశాలకు ముందు దేశ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి.

మోదీ నేతృత్వంలోని ఎన్‌డీఎ సర్కార్ దృష్టి అంతా ఇప్పుడు డీలిమిటేషన్‌పై ఉంది. ఈనెల 20 నుంచి పార్లమెంట్ సమా శాలు ప్రారంభం కానున్నాయి. దీంతో ఈసారి ఎలాగైనా గండం గట్టెందుకు అవసరమైన వ్యూహాలతో సిద్ధం అవుతోంది. ఆయా రాష్ట్రా ల్లోని రాజకీయాలను తనకు అనులంగా మార్చుకుని ముందుకు సాగబో తున్నట్లు తాజా పరిస్థితులు చెప్పకనే చెబుతున్నాయి. రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరని ఈ సమావేశాలు బహుశా నిరూపించనున్నాయి. వర్షాకాల పార్లమెంట్ సమావేశాలకు ముందు దేశ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన రాజ్యాంగ 131వ సవరణ బిల్లు మళ్లీ చర్చకు రావచ్చన్న సంతాలు కనిపిస్తున్నాయి. ఈ బిల్లును ఆమోదించాలంటే లోక్‌సభలో మూడింట రెండు వంతుల మెజా రిటీ అవసరం. ఇటీవల మారుతున్న రాజకీయ సవూకరణాలు ఎన్డీఏ ప్రభుత్వానికి ఈ లక్ష్యాన్ని చేరుకునే అవకాశా లను మరింత పెంచుతున్నాయనే చర్చ సాగుతోంది. గతంలో ఈ బిల్లుకు తగిన మద్దతు లభించక పోవడంతో అది ఆమోదం పొంద లేదు. అయితే ఇప్పుడు తృణమూ ల్ కాంగ్రెస్‌లో చోటుచేసుకున్న పరిణామాలు, శివసేనలో జరిగిన మార్పులు, అలాగే శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ వర్గం నుంచి వస్తున్న సంతాలు ఎన్డీఏకు అనులంగా మారుతున్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా సుప్రియా సూలే చేసిన వ్యాఖ్య లు ఈ అంశంపై కొత్త చర్చకు దారితీశాయి. డీలిమి టేషన్ విషయంలో అన్ని రాష్ట్రాలకు సమాన న్యాయం జరిగేలా లోక్‌సభ సీట్లను 50 శాతం వరకు పెంచితే తమ పార్టీ సానులంగా ఆలోచించే అవకాశ ముందని సుప్రియా సూలే వ్యాఖ్యానించడం ప్రాధాన్యం సంతరిం చుకుంది. గతంలో ఇదే అంశంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా సీట్ల పెంపుపై చర్చించేందుకు సిద్ధమని పేర్కొనడం ఇప్పుడు మరోసారి ప్రస్తావనకు వస్తోంది. ఇటీవల ఎన్సీపి అధినేత శరద్ పవార్‌ను మహారాష్ట్ర డిప్యూటి సీఎం ఏక్‌నాథ్ షిండే కలుసుకుని చర్చించారు. బయటకు సాదాసీదా భేటీ అయినా రేపటి పార్లమెంట్ సమావేశాల్లో మద్దతకు సంబంధించిన వ్యవహారం సాగిందనే అంటున్నారు. ఇప్పటి రాజకీ య పరిస్థితుల్లో ఎన్డీఏకు ఇప్పటి ఉన్న బలానికి అదనంగా తిరుగు బాటు చేసిన తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు, శివసేన నుంచి మారిన సభ్యులు, శరద్ పవార్ వర్గానికి చెందిన ఎంపీలు మద్దతు ఇస్తే సంఖ్య గణనీయంగా పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. అయితే మూడింట రెండు వంతుల మెజారిటీ సాధించడంలో డీఎం వైఖరి అత్యంత కీలకంగా మారింది. డీఎంకు చెందిన ఎంపీలు మద్దతు ఇస్తే ప్రభుత్వం లక్ష్యా నికి మరింత చేరువ అవుతుందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. రాజ్యాంగ 131వ సవరణ బిల్లు ద్వారా 2011 జనాభా లెక్కల ఆధారంగా లోక్‌సభ స్థానాల పునర్విభజన, సీట్ల సంఖ్య పెంపు, అలాగే మహిళల కు 33 శాతం రిజర్వేషన్ అమలుకు సంబంధిం చిన అంశాలు వేగవంతం చేయాలన్నది ంద్ర ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. అందు ఈ బిల్లుకు కేంద్రం అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. అయితే, ప్రతిపక్ష పార్టీలు ఈ అంశంపై ఇంకా పూర్తి స్థాయిలో తమ వైఖరిని వెల్లడించలేదు. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గే అవకాశా లపై గతంలో వ్యక్తమైన ఆందోళనలు ఇంకా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అన్ని పార్టీలను ఒప్పించే ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. వర్షా కాల సమావేశాలు ప్రారంభమైన తర్వాత డీలిమిటేషన్ బిల్లుపై ఎలాంటి చర్చ జరుగుతుంది. .ఎన్డీఏ మూడింట రెండు వంతుల మెజారిటీని సవూకరించగలదా.. శరద్ పవార్ వర్గం, డీఎం వంటి పార్టీల తుది నిర్ణ యం ఎలా ఉంటుంది.. అనే అంశాల పై దేశ రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఈ సమావేశాల్లో జరిగే పరిణామాలు దేశ రాజకీయ దిశను ప్రభావితం చేసే అవకాశముం దని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు తమిళనాడులో రాజకీ యం మరింత వేడెక్కుతోంది. ఆ రాష్ట్రం లోని ఇండియా టమిలో విభేదాలు మరింత బయటపడుతున్నాయి. సీఎం జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం(టీవీ)తో చేతు లు కలిపేందుకు ద్రవిడ మున్నేట్ర కళగం(డీఎం) విముఖత చూపుతోంది. దీనికి కాంగ్రెస్ మద్దతు తెలుపగా.. డీఎం మాత్రం ససేమిరా అంటోంది. ఈ సందర్భంగా డీఎం ఎంపీ గణపతి పి.రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. 'ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్ని కల తర్వాత తొమ్మిదేళ్లుగా మాతో ఉన్న కాంగ్రెస్.. ఇప్పుడు టీవీకు మద్దతి స్తోంది. ఇది వెన్నుపోటుతో సమానం. మంత్రి పదవుల కోసమే కాంగ్రెస్ డీఎంను వదిలేసింది. ఇప్పుడు వీసీను మధ్యవర్తిగా వాడుకుంటూ మళ్లీ డీఎంను ఒప్పించే ప్రయత్నం చేస్తోందని వ్యాఖ్యానిం చారు. కేరళ, బెంగాల్ తరహా రాజకీయాలు తమిళనాడులో పనికిరావని రాజ్‌కుమార్ స్పష్టం చేశారు. ప్రస్తుతం.. తమిళనాడులో టీవీ మూడో ప్రధాన రాజకీయ పార్టీగా అధికారంలోకి వచ్చిందని, దీంతో రాష్ట్ర రాజకీయ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయన్నారు. అంతేకా కుండా.. ప్రస్తుతం పార్లమెంట్‌లో ఒక్క ఎంపీ కూడా లేని టీవీను ఇండియా కూటమిలో భాగంగా పరిగణిం చాలా అనే అంశంపైనా చర్చించాల్సిన అవసరముందని రాజ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ తమను వదులుకోవడం ద్వారా అది ఇండియా టమి నష్టం చేరుస్తుందని ఆయన చెప్పుకొచ్చారు. మొత్తంగా ఇప్పుడు బిజెపి గేమ్‌ప్లాన్ బాగా వర్కవుట్ అయ్యేలా కనిపిస్తోంది.

వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన తర్వాత డీలిమిటేషన్ బిల్లుపై ఎలాంటి చర్చ జరుగుతుంది.. ఎన్డీఏ మూడింట రెండు వంతుల మెజారిటీని సవూకరించగలదా.. శరద్ పవార్ వర్గం, డీఎం వంటి పార్టీల తుది నిర్ణ యం ఎలా ఉంటుంది.. అనే అంశాలపై దేశ రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఈ సమావేశాల్లో జరిగే పరిణామాలు దేశ రాజకీయ దిశను ప్రభావితం చేసే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

EDITORIAL

# రాజకీయ చదరంగంలో సరిహద్దు గ్రామం!

- నాడు హామీల జల్లు.. నేడు అరెస్టుల పర్వం!
- వనపర్తిలోనే ఉంచాలా? నాగర్‌కర్నూల్‌కు మార్చాలా?
- ఓట్ల కోసం పావులు కదుపుతున్న నేతలు..
- విద్యా, వైద్యానికి దూరమవుతున్న ప్రజలు
- రాజకీయ బదిలీల వెనుక అసలు మతలబు ఏమిటి?
- గ్రామం జిల్లా మారితే, నియోజకవర్గాల సరిహద్దులు లేదా స్థానిక సంస్థల జడ్పీటీసీ, ఎంపీపీ సమీకరణాలు మారిపోతాయనే భయం నేతల్లో ఉందా?
- నాడు తాము డిమాండ్ చేసినా చేయలేదు.. ఇప్పుడు ప్రతిపక్షాలు పోరాటం చేసి క్రెడిట్ కొట్టేస్తాయనే ఈగో అడ్డు వస్తోందా?
- మూడు నెలల్లో చేస్తామన్న హామీని నెరవేర్చలేక, వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికే అరెస్టుల పర్వానికి తెరలేపారా?

ప్రజానావ, ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో: ఎన్నికల ముందు ఓట్ల కోసం ఒక మాట.. గద్దెనెక్కిన తర్వాత మరో మాట! ఇదీ వనపర్తి జిల్లా సరిహద్దులో ఉన్న రేవల్లి మండలం తల్పునూర్ గ్రామం పట్ల అధికార పక్ష నేతలు అవలంబిస్తున్న తీరు. భౌగోళికంగా తమకు అత్యంత దగ్గరగా ఉన్న నాగర్ కర్నూల్ జిల్లాలో తమ గ్రామాన్ని కలపాలన్నది ఆ గ్రామ ప్రజల దశాబ్దాల కల. నాడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇదే డిమాండ్‌ను భుజానెత్తుకుని, అధికార పార్టీని ఇరుకున పెట్టిన నేతలు.. నేడు తాము అధికా రంలోకి రాగానే ప్లేట్ ఫిరాయించారన్నట్టు గ్రామంలో ఆరోపణలొస్తున్నాయి. గ్రామాన్ని బదిలీ చేయాలని శాంతియుతంగా దీక్షలు చేస్తున్న వారిపై అక్రమ అరెస్టులతో ఉక్కుపాదం మోపుతుండటం స్థానికంగా తీవ్ర దుమారం రేపుతోంది.







## ఎమ్మెల్యే రాజకీయ భవితవ్యానికి ముప్పు?

### కుంటి నరసింహ..



ఈ పరిణామాలు వనపర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి రాజకీయ గ్రాఫ్‌ను తీవ్రంగా దెబ్బతీసేలా కనిపి స్తున్నాయి. ఇచ్చిన హామీని మూడు నెలల్లో నెరవేరుస్తానని చెప్పి, ఇప్పుడు కనీసం స్పందిం చకపోవడంతో ప్రజల్లో ఎమ్మెల్యేపై నమ్మకం సడలింది. శాంతియుత దీక్షలపై పోలీసులతో అక్రమ అరెస్టులు చేయించడం వల్ల నియోజక వర్గ వ్యాప్తంగా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంది. నాడు కాంగ్రెస్ చేసిన రాజకీయాన్ని, నేడు వారి వైఫల్యాన్ని ఎండగట్టడానికి ప్రతిపక్షాలు ఈ అంశాన్ని పెద్ద అస్త్రంగా మలచుకుంటున్నాయి.

## నాగర్‌కర్నూల్‌తోనే ఊరికి మేలు..

### మాద్గుల చిన్నకూర్మత్‌రెడ్డి (బిఆర్‌ఎస్ మాజీ ఎంపీటీసీ)



కేవలం 14 కిలోమీటర్ల దూరంలో ఉన్న నాగర్‌కర్నూల్ కు మార్చితే విద్య, వైద్యం, వ్యాపార లావాదేవీల పరంగా గ్రామస్తులకు ఎంతో మేలు జరుగుతుంది. వనపర్తి 34 కిలోమీటర్ల దూరంలో ఉండటం వల్ల అత్యవసర సమయా ల్లో వైద్యం అందక ప్రజలు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చదువుకున్న యువత ఉద్యోగాల పరంగా స్థానికత కోల్పోయి తీవ్రంగా నష్టపోతున్నారు. అందుకే ఎల్కేజీ పిల్లవాడి నుంచి పండు ముసలి వరకు అందరూ నాగర్‌కర్నూల్ జిల్లానే కోరుకుంటున్నాం.

## దీక్షలపై అణచివేత: తలుపునూరులో ఉద్రిక్తత

### ఎల్లస్వామి (డీఎస్‌పీ పార్టీ)



మండల పరిధిలోని తల్పునూర్ గ్రామంలో అఖిలపక్షం ఆధ్వర్యంలో 30రోజులుగా చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఉద్రిక్తంగా మారాయి. శాంతియుతంగా సాగుతున్న ఈ దీక్షలను భగ్నం చేసేందుకు అధికార పార్టీ నాయకులు కుట్ర పన్నారని, పోలీసులతో గ్రామ పెద్దలు, కుల సంఘా ల నాయకులు, వివిధ పార్టీల ప్రతినిధులను అక్రమంగా బుధవారం 15న అరెస్టు చేయించారు. ఓట్ల కోసం వచ్చి కాళ్లు మొక్కి, హామీలు ఇచ్చి.. ఇప్పుడు ప్రశ్నిస్తే పోలీస్ స్టేషన్లకు పంపుతారా.

## నాడు ఆందోళనలు: నేడు హామీల తుంగలో తొక్కడం!

గత బీఆర్‌ఎస్ హయాంలో 2024 అసెంబ్లీ ఎన్నికల సమయంలో అప్పటి మంత్రి నిరంజన్ రెడ్డిని రాజకీయంగా దెబ్బతీయ డమే లక్ష్యంగా స్థానిక కాంగ్రెస్ నాయకులు పలు పార్టీలను కలుపుకుని పెద్ద ఎత్తున దీక్షలు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మూడు నెలల్లోనే మీ గ్రామాన్ని నాగర్‌కర్నూల్ జిల్లాలో కలుపుతామని అప్పట్లో కాంగ్రెస్ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే మేఘారెడ్డి స్వయంగా హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పాటై నెలలు గడుస్తున్నా గ్రామం బదిలీపై కనీస వూసే లేదు. దీంతో నాడు హామీ ఇచ్చిన కాంగ్రెస్ నేతలను నిలదీస్తూ.. బీఆర్‌ఎస్, ఇతర పార్టీల నాయకులు, గ్రామస్థులు కలిసి నేడు రిలే నిరాహార దీక్షల కు దిగారు. అయితే, ప్రజాస్వామ్యబద్ధంగా జరుగుతున్న ఈ ధర్నాలను పోలీసులు అడ్డుకోవడం, అక్రమ అరెస్టులకు పాల్పడటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## ఇప్పటికైనా కాలయాపన వీడాలి



తమ రాజకీయ ప్రయోజనాల కోసం ఒక గ్రామాన్ని, అక్క డి ప్రజల భవిష్యత్తును పణంగా పెట్టడం సరికాదని విశ్లేష కులు భావిస్తున్నారు. ఈ బదిలీ వ్యవహారానికి రాజకీయ రంగు పూయడం ఆపి, ప్రజల కష్టాలను గుర్తించి ప్రభుత్వం తక్షణమే స్పందించాలి. హామీ ఇచ్చిన ప్రజాప్రతినిధులు మాట నిలబెట్టుకుని, గ్రామాన్ని నాగర్‌కర్నూల్ జిల్లాలో కలిపేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో ఈ ఉద్యమం మరింత ఉధృతం కాక తప్పదు.

– కుర్మయ్య (అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు)




# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

### కలెక్టర్ అనురాగ్ జయంతి

ప్రజానావ, మోత్కూరు: ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు, పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. గురువారం మోత్కూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, ఆసుపత్రిలోని వార్డులు, ఓపీ, ఇన్‌పేషెంట్ సేవలు, పరిశుభ్రత, మందుల లభ్యతను పరిశీలించారు. వార్డుల్లో అపరిశుభ్రమైన బెడ్‌షీట్లు ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేసి సంబంధిత సూపర్‌వైజర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ప్రతి రోగి చికిత్స, పరీక్షల వివరాలను ఈ–ఆరోగ్యం యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. ఓపీ రోగుల సంఖ్య, మందుల పంపిణీ, పరీక్షల నిర్వహణ, గర్భిణీల ట్రాకింగ్, ప్రసవాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి ఆవరణలో నిల్వ ఉన్న నీటిని తొలగించి, వాటర్ సంప్‌ను శుభ్రపరచి వినియోగంలోకి తీసుకురావాలని మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. ఆసుపత్రి నిర్వహణలో నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరిస్తూ, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పి. జ్యోతి, ఎంపీడీవో బాలాజీ నాయక్, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నిరోషా, సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామీణాభివృద్ధి పనుల్లో జాప్యం వద్దు

- ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలి
- కలెక్టర్ ప్రతీక్ జైన్




ప్రజానావ, సంగారెడ్డి: గ్రామీణాభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాల అమలులో అధికారులు సమన్వయంతో, నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో డీఎల్పీవోలు, డీపీఎంలు, ఎంపీడీవోలు, ఎంపీఓలు, ఏపీఓలు, ఏపీఎంలు, పంచాయతీరాజ్ ఈఈలు, డీఈలు, ఏఈలు తదితర అధికారులతో గ్రామీణాభివృద్ధి పనులపై మండలాల వారీగా సమగ్ర సమీక్ష నిర్వహించారు. వివో భవనాలు, గ్రామపంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలు, పాఠశాల మరుగుదొడ్లు, కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్‌లు (సీఎస్‌సీలు), వ్యక్తిగత గృహ మరుగుదొడ్లు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, పాఠశాల కాంపౌండ్ వాల్స్, కల్వర్టులు, డ్రైనేజీ పనులు, ఎస్‌హెచ్‌జీ ఫెడరేషన్ భవనాలు, తాగునీటి సరఫరా తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వివో భవనాల నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్‌ల నిర్మాణ పనులను వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ప్రజలకు నిరంతరాయంగా సురక్షిత తాగునీరు అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పాఠశాలల్లోని మరుగుదొడ్లు పూర్తిస్థాయిలో వినియోగానికి అనుకూలంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, మరుగుదొడ్లు అవసరమైన పాఠశాలలకు కొత్త టాయిలెట్ల నిర్మాణానికి సంబంధించిన అంచనా ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేసి సమర్పించాలని ఆదేశించారు. అలాగే అవసరమైన పాఠశాలల్లో కాంపౌండ్ వాల్ నిర్మాణాలకు అంచనా ప్రణాళికలు రూపొందించాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. గ్రామీణాభివృద్ధిలో ఎంపీడీవోల పాత్ర ఎంతో కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. మండల స్థాయిలో అన్ని శాఖల అధికారులతో తరచూ సమీక్షలు నిర్వహించి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. డివిజన్ స్థాయిలో డివిజనల్ పంచాయతీ అధికారులు సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రతి అభివృద్ధి పనిని క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాలకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పాండు, డీఆర్‌డీఓ జ్యోతి, జెడ్పీ సీఈవో జానకిరెడ్డి, ఇన్‌చార్జి సీపీఓ జగదీష్, ఎంపీడీవోలు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# దసరాలోపు పీఆర్సీ ప్రకటించాలి

- లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం
- పీఆర్టీయూ టీఎస్ అధికార ప్రతినిధి వంగ మహేందర్‌రెడ్డి

ప్రజానావ, గజ్వేల్: దసరా పండుగలోపు ఉపాధ్యాయ, ఉద్యోగుల పెండింగ్ పీఆర్సీని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపడతామని పీఆర్టీయూ టీఎస్ అధికార ప్రతినిధి వంగ మహేందర్ రెడ్డి హెచ్చరించారు. గజ్వేల్ మండల శాఖ ఆధ్వర్యంలో ప్రజ్ఞాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పీఆర్టీయూ టీఎస్–2026 సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే పీఆర్సీ అమలు చేస్తామని హామీ ఇచ్చిందని, అయితే ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు పూర్తవుతున్నా ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన నిర్ణయం ప్రకటించకపోవడం ఉపాధ్యాయులు, ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తికి దారితీసిందన్నారు. పీఆర్సీ గడువు ముగిసి ఇప్పటికే మూడు సంవత్సరాలు కావస్తున్నప్ప టికీ ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులకు సంబంధించిన పలు ఆర్థిక ప్రయోజనాలు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయని, ఆరు డీఏ బకాయిలు చెల్లించాల్సి ఉండటంతో పాటు గతంలో ఎన్నడూ లేని విధంగా ఉపాధ్యాయుల సొంత బిల్లులు కూడా నిలిపివేస్తున్నారని విమర్శించారు. 2003 డీఎస్సీ ద్వారా నియామకమైన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో సీపీఎస్ రద్దు చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. ఉపాధ్యా యులకు ప్రయోజనం చేకూరే విధంగా మెరుగైన పీఆర్సీ సాధించడమే సంఘం లక్ష్యమని, అందుకోసం అన్ని స్థాయిల్లో పోరాటం కొనసాగిస్తా మని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ టీఎస్ సిద్ధిపేట జిల్లా అధ్యక్షుడు మల్లుగారి ఇంద్రసేనారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదరాసపల్లి శశిధర్, పత్రిక సంపాదక వర్గ సభ్యుడు పిన్నింటి రామకృష్ణారెడ్డి, గజ్వేల్ మండల ప్రధాన కార్యదర్శి తీగుళ్ల లింగం, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పుల్లూరి శివశం కర్ నరసింహారెడ్డి, వేమారెడ్డి బాలుచరణ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు యాదగిరి, వెంకటేశం నాగరాజు, రాష్ట్ర కార్యదర్శి జీవన్ రెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు నాగరాజు, సొసైటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మండల నాయకులు నర్సింహారెడ్డి, దిలీప్ కుమార్, సీనియర్ నాయకులు బాల్‌రెడ్డి, సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ వద్దిరాజు రవిచంద్రకు ఘన సన్మానం

ప్రజానావ, ఖమ్మం: రాజ్యసభలో బీఆర్‌ఎస్ పక్ష నేతగా, బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీ వద్దిరాజు రవిచంద్రకు పార్టీ శ్రేణుల నుంచి అభినందనలు వెల్లువెత్తుతు న్నాయి. గురువారం ఉదయం నుంచి పలువురు బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, యువ నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాం క్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకుడు, రోడ్లు–భవనాల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ మెట్టు శ్రీనివాస్ ఎంపీ వద్దిరాజును కలిసి సత్కరించారు. అలాగే పినపాక మాజీ ఎమ్మెల్యే, ప్రభుత్వ మాజీ విప్ రేగా కాంతారావు ఆయనను కలిసి అభినందనలు తెలిపారు. రేగా కాంతారావుతో పాటు మహేశ్వరం సాయినాథ్, సంగీత్, గంధసిరి రేవతి తదితరులు కూడా ఎంపీకి శుభాకాంక్షలు తెలియజే శారు. బీఆర్‌ఎస్ నాయకుడు, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు కోతి కిశోర్ గౌడ్, మాజీ ఎంపీ, తెలంగాణ భవన్ ఇన్‌చార్జి రావుల చంద్రశేఖర్ రెడ్డి, నాయకుడు గౌతంప్రసాద్‌లతో కలిసి ఎంపీ వద్దిరాజును శాలువాతో సత్కరించి అభినందించారు. మరోవైపు ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన యువ నాయకులు పోట్రు ప్రవీణ్, దుగ్గిదేవర యుధిష్ఠర్ తదితరులు తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వరంగల్ నగరానికి చెందిన గుడిశాల రాజు, విక్రమ్, ఏరుకొండ వినయ్, జనగాం మణి తదితరులు భద్రకాళి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించి ఎంపీని అభినందించగా, ఖైరతాబాద్ బీఆర్‌ఎస్ నాయకులు సూర్య విష్ణు, పి. శ్రీరామ్ తదితరులు కూడా శాలువాతో సన్మానించి తమ శుభాకాంక్షలు తెలియజేశారు.





# సింగరేణికి కొత్త గనులు కేటాయించాలి: ఏఐటీయూసీ

- బీజేపీ విధానాల వల్లే కొత్త బొగ్గు బ్లాకులు దక్కడం లేదని విమర్శ
- 12వ వేజ్ బోర్డు ఏర్పాటు, 31 డిమాండ్ల పరిష్కారం లేకుంటే ఆగస్టులో సమ్మె హెచ్చరిక

**ప్రజానవ, రామగుండం:** సింగరేణికి కొత్త బొగ్గు గనులు రాకపోవడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలే కారణమని గుర్తింపు సంఘం ఏఐటియుసి ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ కొరిమి రాజ్‌కుమార్ ఆరోపించారు. ఓసీపీ–5లో గురువారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ, తాడిచెర్ల–2 బొగ్గు బ్లాక్‌ను సింగరేణికి కేటాయించాలంటూ తొలి ఉద్యమాన్ని ఏఐటియుసి చేపట్టిందని గుర్తు చేశారు. 2012లో అన్ని కార్మిక సంఘాలను ఏకం చేసి 'సేవ్ సింగరేణి' పేరుతో ఉద్యమం నిర్వహించి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చామని తెలిపారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం కొత్త బొగ్గు బ్లాకులను సింగరేణికి కేటాయించకుండా ప్రైవేటు సంస్థలకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల ప్రభుత్వ రంగ సంస్థ నష్టపోతోందని విమర్శించారు.

### తెలంగాణలోని బొగ్గు బ్లాకులన్నీ సింగరేణికే ఇవ్వాలి

సింగరేణిలో రాష్ట్ర ప్రభుత్వానికి 51 శాతం, కేంద్ర ప్రభుత్వానికి 49 శాతం వాటా ఉన్నప్పటికీ సంస్థను బలోపేతం చేయకుండా నిర్వీర్యం చేసే విధానాలు అనుసరిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో ఉన్న అన్ని బొగ్గు బ్లాకులను వేలం ప్రక్రియకు దూరంగా ఉంచి నేరుగా సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. బాయి బాట, భరోసా యాత్ర పేర్లతో రాజకీయ నాయకులు యాత్రలు చేయడం వల్ల కార్మికులకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. 2015లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎంఎండీఆర్ చట్టం కారణంగానే సింగరేణికి కొత్త గనులు దక్కడం లేదని ఆరోపించారు. సింగరేణి యాజమాన్యం గుర్తించిన నాలుగు బొగ్గు బ్లాకులను కూడా తాడిచెర్ల–2 మాదిరిగానే వేలం లేకుండా సంస్థకు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

### డిమాండ్లు పరిష్కరించకుంటే సమ్మె తప్పదు

సింగరేణి యాజమాన్యానికి 31 డిమాండ్లతో సమ్మె నోటీసు ఇచ్చామని, ఇప్పటివరకు రెండు విడతల చర్చలు జరిగినప్పటికీ ప్రధాన సమస్యలపై స్పష్టత రాలేదని కొరిమి రాజ్‌కుమార్ తెలిపారు. కొత్త బొగ్గు బ్లాకుల కేటాయింపు, 12వ వేతన సంఘాన్ని వెంటనే ఏర్పాటు చేయడం, నాలుగు లేబర్ కోడ్ల రద్దు, రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.56 వేల కోట్ల బకాయిల విడుదల, కార్మికుల ఆదాయపన్ను రీయింబర్స్‌మెంట్ సమస్య పరిష్కారం, మెడికల్ బోర్డు కొనసాగింపు, సొంతింటి పథకం అమలు వంటి ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం, యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆగస్టు నెలలో ఇతర కార్మిక సంఘాలతో కలిసి సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి సింగరేణిని పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. కార్మికుల హక్కులు, సంస్థ పరిరక్షణ కోసం ఏఐటియుసి ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. ఈ సమావేశానికి ఓసీపీ–5 ప్రాజెక్టు కార్యదర్శి గుర్రం ప్రభుదాస్ అధ్యక్షత వహించగా, ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను ప్రసంగించారు. నాయకులు మాదన మహేష్, బోగ సతీష్‌బాబు, గండి ప్రసాద్, ఎడవెల్లి రాజిరెడ్డి, సదయ్య, ఉదయభాను, రవీందర్, నర్మద, అంజన్న, మడ్డి కిరణ్, పాపన్న, పరుశురాం, శ్రీనివాస్, సురేష్, పర్లపెల్లి రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

Singareni news

# ఓసీపీ–3లో వైభవంగా దుర్గామాత బోనాల జాతర

- బోనాల మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన డా. బీ. జనక్ ప్రసాద్



**ప్రజానవ, రామగుండం:** ఆర్జీ–2 ఏరియా ఓసీపీ–3లో గురువారం శ్రీ దుర్గామాత బోనాల జాతర ఊరేగింపు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవంలో ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్, తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ డా. బి. జనక్ ప్రసాద్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా భక్తులతో కలిసి బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఆయన, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ ఆర్జీ–2 ఏరియా వైస్ ప్రెసిడెంట్ కొత్త సత్యనారాయణ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ శంకర్ నాయక్, జనరల్ సెక్రటరీ వికాస్ కుమార్ యాదవ్, నాయకులు సంపత్ రెడ్డి, సలిగామ మల్లేష్, అవినాష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# శ్మశానవాటిక దుస్థితిపై సీపీఐ ఆగ్రహం

- రూ.1 అంత్యక్రియల పథకాన్ని పునరుద్ధరించాలి
- లేకుంటే మున్సిపల్ కార్యాలయం ముట్టడిస్తాం
- సీపీఐ నేతల హెచ్చరిక

**ప్రజానావ, గోదావరిఖని:** గోదావరిఖని గంగానగర్ శివారులోని నగర పాలక సంస్థ హిందూ శ్మశానవాటిక తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని, అక్కడ నెలకొన్న సమస్యలను పట్టించుకోకుండా గత ప్రభుత్వం అమలు చేసిన రూ.1కే అంత్యక్రియల పథకాన్ని రద్దు చేయడం దారుణమని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) నాయకులు మండిపడ్డారు. గురువారం సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గోసిక మోహన్, నగర కార్యదర్శి కే. కనకరాజ్, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్యతో పాటు పార్టీ నాయకులు స్మశానవాటికను సందర్శించి అక్కడి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండేళ్లుగా స్మశానవాటిక అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందని, గతంలో అమలులో ఉన్న రూ.1కే అంత్యక్రియల పథకాన్ని నిలిపివేయడంతో పేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. ప్రస్తుతం స్మశానవాటిక పరిస్థితిని చూస్తే శవాలే కన్నీళ్లు పెట్టుకునేలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు మాటేటి శంకర్, శనిగరపు చంద్రశేఖర్, తొడుపునూరి రమేష్, అబ్దుల్ కరీం, కల్వల జగన్, పోతరాజు గంగారాజు, సాదుల శివ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలి

- పెండింగ్ అట్రాసిటీ కేసులను వేగంగా పరిష్కరించాలి
- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



**ప్రజానవ, నిర్మల్:** ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రతి అర్హుడికి క్షేత్రస్థాయిలో చేరేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తు, పరిష్కార ప్రక్రియను వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాల అమలు, అట్రాసిటీ కేసులు, భూ సమస్యలు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ తదితర అంశాలపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సమావేశానికి ముందు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రాం చిత్రపటాలకు బక్కి వెంకటయ్య, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, జిల్లా ఎస్పీ జానకి షర్మిల, కమిషన్ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించి జ్యోతి ప్రజ్వలన చేశారు.

### అట్రాసిటీ కేసులపై సమీక్ష

జిల్లాలో ఎస్సీ, ఎస్టీలకు అమలవుతున్న సంక్షేమ పథకాల పురోగతి, అట్రాసిటీ కేసుల నమోదు, దర్యాప్తు, ఛార్జిషీట్ల దాఖలు, బాధితులకు పరిహారం చెల్లింపు తదితర అంశాలపై శాఖల వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల వివరాలు, అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా పథకం, కులాంతర వివాహాల ఆర్థిక సహాయం, ఇందిరమ్మ ఇండ్లు, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఉపాధి కల్పన తదితర అంశాలను సమీక్షించారు.

### ప్రతి లబ్ధిదారుడికి పథకాల ప్రయోజనం

ఈ సందర్భంగా బక్కి వెంకటయ్య మాట్లాడుతూ, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు ఆలస్యం లేకుండా అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తు పారదర్శకంగా, నిర్దేశిత గడువులో పూర్తి చేసి బాధితులకు పరిహారం సకాలంలో అందేలా చూడాలని సూచించారు. ప్రతి నెల చివరి వారంలో మండల స్థాయిలో సివిల్ రైట్స్ డే నిర్వహించి చట్టాలు, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని తప్పనిసరిగా నిర్వహించాలని తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద ప్రతి జాబ్‌కార్డు కలిగిన కూలీకి తగిన పని దినాలు కల్పించాలని, సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి నిధులు ఎక్కడైనా పెండింగ్‌లో ఉంటే ముఖ్యమంత్రితో మాట్లాడి విడుదలయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

### సంక్షేమ పథకాల అమలులో జిల్లా ముందంజ

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ, జిల్లాలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలవుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో కామన్ మెనూ అమలు చేస్తున్నామని, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉపకార వేతనాలు, అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా పథకం, కులాంతర వివాహాల ఆర్థిక సహాయం అందిస్తున్నామని చెప్పారు. జిల్లాలో ఇప్పటివరకు 4,306 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని, ఉపాధి హామీ పథకంలో ఎస్సీ, ఎస్టీ కూలీలకు ఉపాధి కల్పనలో నిర్మల్ జిల్లా రాష్ట్రంలో ముందంజలో ఉందన్నారు. బ్యాంకుల ద్వారా 199 ద్విచక్ర, త్రిచక్ర విద్యుత్ వాహనాలను లబ్ధిదారులకు అందించినట్లు వివరించారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, జిల్లాలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తు వేగంగా కొనసాగుతోందని, బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కమిషన్ సభ్యులు కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు క్షేత్రస్థాయిలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, 60 సంవత్సరాలు పూర్తిచేసిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉపాధి అవకాశాలు కల్పించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలని కోరారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు కుస్రం నీలాదేవి, రాంబాబు నాయక్, ప్రవీణ్, లక్ష్మీనారాయణ, అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఏఎస్పీ సాయికిరణ్, డీఆర్‌ఓ రాథోడ్ రమేష్, ఆర్డీఓ దేవీదాస్, డీఎస్పీ శ్రీనివాస్, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# అదృశ్యమైన విద్యార్థిని గుర్తింపు

## ప్రత్యేక బృందాల గాలింపుతో బాలుడు సురక్షితం

**ప్రజానావ, కామారెడ్డి:** భిక్నూర్ మండలంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల నుంచి కనిపించకుండా పోయిన 10 ఏళ్ల విద్యార్థిని భిక్నూర్ పోలీసులు కేవలం రెండు గంటల్లో గుర్తించి సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సాబావత్ రఘు ఇచ్చిన ఫిర్యాదు మేరకు, ఐదో తరగతి విద్యార్థి కమ్మరిపల్లి రుత్విక్ ఉదయం ప్రార్థన అనంతరం కనిపించకుండా పోయినట్లు భిక్నూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. విషయం తీవ్రతను గుర్తించిన పోలీసులు వెంటనే గాలింపు చర్యలు ప్రారంభించారు.

### ప్రత్యేక బృందాలతో ముమ్మర గాలింపు

జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు, కామారెడ్డి డీఎస్పీ పర్యవేక్షణలో భిక్నూర్ సీఐ ఆధ్వర్యంలో రెండు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. పాఠశాల పరిసరాలతో పాటు సమీప గ్రామాలు, ప్రధాన రహదారులు, బస్ స్టాండ్లు తదితర ప్రాంతాల్లో విస్తృతంగా గాలింపు చేపట్టారు.

### తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగింత

పోలీసుల వేగవంతమైన చర్యల ఫలితంగా రెండు గంటల్లోనే విద్యార్థిని గుర్తించి సురక్షితంగా రక్షించారు. అనంతరం బాలుడిని తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యానికి అప్పగించారు. విద్యార్థిని త్వరితగతిన గుర్తించి సురక్షితంగా రక్షించిన పోలీసు బృందాన్ని జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర, కామారెడ్డి డీఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా భిక్నూర్ పోలీసులు మాట్లాడుతూ, పిల్లలు లేదా కుటుంబ సభ్యులు కనిపించకుండా పోయిన సందర్భాల్లో ఆలస్యం చేయకుండా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. తక్షణ సమాచారం అందితే వేగంగా గాలింపు చర్యలు చేపట్టి సురక్షితంగా గుర్తించే అవకాశాలు మరింత పెరుగుతాయని తెలిపారు.

# అంబేద్కర్ భావజాల వ్యాప్తితోనే సమాజాభివృద్ధి

- పద్మశ్రీ మందకృష్ణ మాదిగ
- కేయూ అంబేద్కర్ స్టడీ సెంటర్ జాయింట్ డైరెక్టర్‌గా డా. పుల్ల శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ




**ప్రజానావ, కాకతీయ యూనివర్సిటీ:** సమాజ అభివృద్ధి, అణగారిన వర్గాల సంక్షేమం భారతరత్న డా. బి.ఆర్. అంబేద్కర్ చూపిన భావజాలాన్ని ప్రతి వర్గానికి చేరవేయడం ద్వారానే సాధ్యమవుతుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం అంబేద్కర్ స్టడీ సెంటర్ జాయింట్ డైరెక్టర్‌గా డాక్టర్ పుల్ల శ్రీనివాస్ గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై శుభాకాంక్షలు తెలిపారు.

### సంఘీభావ ర్యాలీ నిర్వహణ

ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు, దళిత సంఘాల ప్రతినిధులు, విద్యార్థులతో కలిసి కాకతీయ విశ్వవిద్యాలయ గ్రంథాలయం నుంచి అంబేద్కర్ స్టడీ సెంటర్ వరకు సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కాకతీయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్ర నుంచి డాక్టర్ పుల్ల శ్రీనివాస్ అధికారికంగా జాయింట్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

### అంబేద్కర్ ఆశయాల ప్రచారానికి కృషి

ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ, డాక్టర్ పుల్ల శ్రీనివాస్ నాయకత్వంలో అంబేద్కర్ స్టడీ సెంటర్ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. డా. బి.ఆర్. అంబేద్కర్ సిద్ధాంతాలు, సామాజిక న్యాయం, సమానత్వం, రాజ్యాంగ విలువలను సమాజంలోని అన్ని వర్గాలకు విస్తృతంగా చేరవేయాల్సిన అవసరం ఉందన్నారు. బహుజన సమాజానికి అంబేద్కర్ స్టడీ సెంటర్ విజ్ఞాన వేదికగా నిలిచి పరిశోధన, అధ్యయనం, చైతన్య కార్యక్రమాలకు కేంద్రంగా మారాలని కోరారు. జాయింట్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ పుల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, అంబేద్కర్ ఆశయాల ప్రచారం, పరిశోధనలకు ప్రోత్సాహం, విద్యార్థుల్లో రాజ్యాంగ విలువలపై అవగాహన పెంపొందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఓఎస్డీ ప్రొఫెసర్ బైరు వెంకట రామిరెడ్డి, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్, పాలకమండలి సభ్యుడు ప్రొఫెసర్ బి. సురేష్ లాల్, డాక్టర్ చిర్రా రాజుగౌడ్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎన్. రమణ, ప్రొఫెసర్ కే. బిక్షాలు, ప్రొఫెసర్ ఎం. స్వర్ణలత, ప్రొఫెసర్ ఎల్.పీ. రాజ్‌కుమార్, డాక్టర్ బి.ఎస్.ఎల్. సౌజన్య, డాక్టర్ తాడూరి శాస్త్రి, ప్రొఫెసర్ పి. శ్రీనివాసరావు, డాక్టర్ మామిడి లింగయ్య, డాక్టర్ గడ్డం కృష్ణయ్య, డాక్టర్ సంకినేని వెంకట్, డాక్టర్ పోడేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తుల నుంచి అదనపు డబ్బులు వసూలు చేస్తే చర్యలు

- వేములవాడ రాజన్న ఆలయ కళ్యాణకట్టలో ఆలయ ఈవో శ్రీమతి రమాదేవి ఆకస్మిక తనిఖీలు



**ప్రజానావ, వేములవాడ :** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం కింది కళ్యాణకట్టలో ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) శ్రీమతి ఎల్. రమాదేవి గురువారం ఉదయం 6:30 గంటలకు స్వయంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇటీవల సామాజిక మాధ్యమాల్లో కళ్యాణకట్టలో భక్తుల నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు రావడంతో పాటు, కొంతమంది భక్తులు చేసిన ఫిర్యాదుల నేపథ్యంలో ఆమె ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించారు. తనిఖీల సందర్భంగా ఈవో కళ్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకునేందుకు వచ్చిన భక్తులతో నేరుగా మాట్లాడి, వారికి ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయా, ఎవరైనా అదనపు డబ్బులు డిమాండ్ చేస్తున్నారా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. భక్తుల నుంచి వచ్చిన అభిప్రాయాలను నమోదు చేసుకున్నారు. అనంతరం అక్కడ విధులు నిర్వహిస్తున్న నాయి బ్రాహ్మణులను ఒక్కొక్కరిని వీడియో రికార్డింగ్ ద్వారా ఇంటర్వ్యూ చేసి వారి పూర్తి వివరాలు సేకరించారు. వారికి వేతనాలు సక్రమంగా అందుతున్నాయా, కాంట్రాక్టర్ ద్వారా ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నారనే అంశాలపై ఆరా తీశారు. కళ్యాణకట్ట నిర్వహణ కాంట్రాక్టర్‌తో మాట్లాడిన ఈవో, అక్కడ పనిచేస్తున్న ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా యూనిఫాం (డ్రెస్ కోడ్) మరియు గుర్తింపు కార్డులు (ఐడీ కార్డులు) ఇవ్వాలని ఆదేశించారు. అలాగే కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లిస్తున్నారా అనే విషయాన్ని కూడా అడిగి తెలుసుకున్నారు. భక్తుల నుంచి తలనీలాల కోసం అదనపు డబ్బులు డిమాండ్ చేయడం, వసూలు చేయడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని ఈవో స్పష్టం చేశారు. ఎవరైనా భక్తుల నుంచి అధిక మొత్తంలో డబ్బులు తీసుకున్నట్లు నిర్ధారణ అయితే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, అవసరమైతే కాంట్రాక్టును రద్దు చేసి బ్లాక్‌లిస్ట్‌లో చేర్చుతామని హెచ్చరించారు. భక్తులకు అవగాహన కల్పించేందుకు కళ్యాణకట్ట గోడలపై తలనీలాల టికెట్ ధర రూ.50 మాత్రమే, నాయి బ్రాహ్మణులకు ఎలాంటి అదనపు డబ్బులు చెల్లించవద్దు, అదనపు డబ్బులు తీసుకోవడం శిక్షార్హమైన నేరం అనే సమాచారాన్ని స్పష్టంగా ప్రదర్శించే బోర్డులు ఏర్పాటు చేయించారు. అదేవిధంగా భక్తులకు నిరంతరం అవగాహన కల్పించే విధంగా మైక్ ద్వారా ప్రకటనలు చేయించే ఏర్పాట్లు కూడా చేశారు. ఈ సందర్భంగా కళ్యాణకట్టలోని రెండు విభాగాలను పూర్తిగా పరిశీలించిన ఈవో, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారదర్శకంగా సేవలు అందించాలని సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. కళ్యాణకట్టలో నగదు వసూళ్లపై నిరంతర నిఘా ఉంచేందుకు ప్రత్యేకంగా ఇద్దరు సిబ్బందిని నియమించి, భక్తుల నుంచి ఎవరైనా అదనపు డబ్బులు వసూలు చేస్తున్నారా అనే అంశాన్ని పర్యవేక్షించాలని ఆదేశించారు. అదేవిధంగా కళ్యాణకట్ట ప్రాంగణమంతా సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉండేలా చర్యలు తీసుకోవాలని, కెమెరాలు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా ఫిర్యాదులను పరిశీలించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అనంతరం కళ్యాణకట్ట నిర్వహణకు సంబంధించిన అధికారులతో సమావేశమై పలు కీలక సూచనలు చేశారు. భక్తుల పట్ల మర్యాదగా వ్యవహరించాలని, దేవస్థానం నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. ఆలయానికి వచ్చే ప్రతి భక్తుడికి పారదర్శకమైన, ఇబ్బందుల్లేని సేవలు అందించడమే దేవస్థానం లక్ష్యమని, భక్తుల నుంచి ఎవరైనా అదనపు డబ్బులు వసూలు చేసినట్లయితే వెంటనే దేవస్థానం అధికారులకు సమాచారం ఇవ్వాలని ఈవో శ్రీమతి ఎల్. రమాదేవి కోరారు.

# సైబర్ ఫిర్యాదులపై తక్షణమే స్పందించండి

## జిల్లా అదనపు ఎస్పీ చంద్రయ్య

**ప్రజానావ, సిరిసిల్ల :** జిల్లాలో సైబర్ నేరాల నియంత్రణకు ప్రతి పోలీస్ స్టేషన్‌లో నియమించబడిన సైబర్ వారియర్స్ సమర్థవంతంగా పనిచేయాలని జిల్లా అదనపు ఎస్పీ చంద్రయ్య తెలిపారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సైబర్ వారియర్స్ సమీక్ష సమావేశం నిర్వహించి అదనపు ఎస్పీ పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరాలకు గురైన బాధితులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి పోలీస్ స్టేషన్ లో నియమించిన సైబర్ వారియర్స్, సైబర్ నేరాలపై వచ్చే పిర్యాదులపై తక్షణమే స్పందించి కేసులు నమోదు చేయాలని, సైబర్ నేరగాళ్ల ద్వారా మోసపోయిన వ్యక్తులు డబ్బు బ్యాంకులో ఫ్రీజ్ అయి ఉన్నట్లయితే వీలైనంత త్వరగా డబ్బులు తిరిగి వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రతి పోలీస్ స్టేషన్లలో ఒక సైబర్ వారియర్స్ ని ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రజలు సైబర్ నేరానికి గురైతే ఖంగారు పడకుండా వెంటనే 1930 ట్రోల్ ఫ్రీ నంబర్ కి కానీ, ఎన్.సి.ఆర్.పి పోర్టల్ నందు కానీ, పోలీస్ స్టేషన్లో ఉన్న సైబర్ వారియర్ ని కానీ సంప్రదించాలన్నారు. ప్రతి సైబర్ వారియర్ తన పోలీస్ స్టేషన్ పరిధిలో సైబర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆన్‌లైన్ మోసాలు, డిజిటల్ అరెస్టులు, ఫేక్ లింకులు, ఓటీపీ మోసాలు, పెట్టుబడి మోసాలు తదితర సైబర్ నేరాలపై ప్రజలకు నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో సైబర్ ఆర్ఎస్ఐ జునైద్, సైబర్ వారియర్లు పాల్గొన్నారు.



## వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి

# రూ.11 వేల విరాళం అందజేత

**ప్రజానావ, వేములవాడ :** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఆలయ అభివృద్ధి, విస్తరణ పనుల నిమిత్తం మహారాష్ట్ర రాష్ట్రం నాందేడ్ ప్రాంతానికి చెందిన శ్రీ సోహం రాజేష్ కప్రత్వార్, కుటుంబ సభ్యులు స్వామివారికి రూ.11,000లను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు ఆలయ ప్రోటోకాల్ కార్యాలయంలో ఆలయ పర్యవేక్షకులు శ్రీ జి. శ్రీనివాస్ శర్మ గారికి నగదు రూపంలో విరాళాన్ని అందజేయగా, ఆలయ అధికారులు వారికి అధికారిక రసీదును అందజేశారు అనంతరం భక్తులు శ్రీ భీమేశ్వర స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్




**ప్రజానావ, కోనరావుపేట:** రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో రూ.51 లక్షల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ గురువారం శంకుస్థాపన చేశారు. అనంతరం రూ.15.46 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను 38 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు సమర్థంగా అమలవుతున్నాయని తెలిపారు. వేముల వాడ నియోజకవర్గ అభివృద్ధిని చూసి బీఆర్ఎస్ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. రహదారులు, బ్రిడ్జిలు, సాగునీటి ప్రాజెక్టులు, రాజన్న ఆలయ అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిధులు కేటాయించిందని, అన్ని అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చాకాయల ఎల్లయ్య, ఆత్మ కమిటీ చైర్మన్ ముస్కు ముకుంద రెడ్డి, వైస్ చైర్మన్ తాళ్లపల్లి ప్రభాకర్, నిజామాబాద్ సర్పంచ్ సింగం శ్రీహరి, ఉప సర్పంచ్ రాజు, మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు బోయిని దేవ రాజు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానుక సత్యం, ఫ్యాక్స్ చైర్మన్ బండ నర్సయ్య, నాయకులు ఫిరోజ్ పాషా, చేపూరి గంగాధర్, గొట్టే రుక్మిణి, మార్కెట్ కమిటీ సభ్యులు పలు గ్రామాల సర్పంచులు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

# సోనమ్ ఆరోగ్యం విషమం

- 9 కిలోలకు పైగా బరువు తగ్గిన వాంగ్‌చుక్
- ప్రభుత్వం స్పందించే వరకు దీక్ష ఆపేది లేదన్న సామాజిక కార్యకర్త



**న్యూఢిల్లీ:** సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్య పరిస్థితి దీర్ఘకాల నిరాహార దీక్ష కారణంగా అత్యంత ఆందోళనకర దశకు చేరుకుందని వైద్యులు హెచ్చరించారు. ఇకపై పరిస్థితి మరింత విషమించి శరీర అవయవాలపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని తెలిపారు. అయితే ప్రభుత్వం స్పందించే వరకు తన నిరాహార దీక్షను విరమించే ప్రసక్తే లేదని వాంగ్‌చుక్ స్పష్టం చేశారు. వైద్యుడు డాక్టర్ సతీశ్ లాంబా విడుదల చేసిన ఆరోగ్య బులెటిన్ ప్రకారం, జూన్ 28న దీక్ష ప్రారంభించినప్పటి నుంచి వాంగ్‌చుక్ 9 కిలోలకు పైగా బరువు కోల్పోయి ప్రస్తుతం 56.9 కిలోలకు చేరుకున్నారు. శరీరంలోని కొవ్వు నిల్వలు తగ్గిపోవడంతో కండరాలు క్షీణిస్తున్నాయని, తదుపరి దశలో అవయవాలు దెబ్బతినే ప్రమాదం ఉందని తెలిపారు. ఆయన ఆరోగ్యాన్ని 24 గంటలూ పర్యవేక్షిస్తున్నామని వెల్లడించారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి హామీ లేకుండా దీక్ష విరమిస్తే తప్పు సందేశం వెళ్తుందని వాంగ్‌చుక్ పేర్కొన్నారు. జులై 20న నిర్వహించనున్న **పార్లమెంట్ మార్చ్**ను విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. వాంగ్‌చుక్ ఆరోగ్యంపై దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని విచారించిన ఢిల్లీ హైకోర్టు, ఆయన ఆరోగ్యాన్ని ప్రతిరోజూ పర్యవేక్షించి పరిస్థితి విషమిస్తే వెంటనే వైద్య సహాయం అందించాలని అధికారులను ఆదేశించింది. ప్రతి పౌరుడి ప్రాణం విలువైనదేనని కోర్టు వ్యాఖ్యానించింది.

### పెరుగుతున్న మద్దతు

ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్, జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, సమాజ్‌వాదీ పార్టీ నేత డింపుల్ యాదవ్, రైతు నాయకుడు రాకేశ్ టికాయత్, కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ సహా పలువురు నేతలు వాంగ్‌చుక్‌ను పరామర్శించి నిరాహార దీక్ష విరమించాలని కోరారు. సినీ, సాహిత్య, న్యాయ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు కూడా ప్రభుత్వం వెంటనే చర్చలు ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు.

# అమెరికా స్టూడెంట్ వీసా నిబంధనల్లో కీలక మార్పులు

- నిరవధిక బసకు ముగింపు పలికిన అగ్రరాజ్యం
- విద్యార్థులు, ఎక్స్‌చేంజ్ విజిటర్లు, జర్నలిస్టులకు ఇక గరిష్ఠంగా నాలుగేళ్లే అనుమతి
- కోర్సు పూర్తయ్యాక అదనపు గడువు కావాలంటే ప్రత్యేక దరఖాస్తు తప్పనిసరి
- గ్రాడ్యుయేషన్ తర్వాత దేశం విడిచేందుకు గడువు 60 నుంచి 30 రోజులకు కుదింపు




**వాషింగ్టన్:** విదేశీ విద్యార్థులు, ఎక్స్‌చేంజ్ విజిటర్లు, జర్నలిస్టుల వీసా నిబంధనలను అమెరికా ప్రభుత్వం కఠినతరం చేసింది. ఇప్పటివరకు అమల్లో ఉన్న నిరవధిక బస (డ్యూరేషన్ ఆఫ్ స్టేటస్) విధానానికి ముగింపు పలుకుతూ, ఎఫ్ (విద్యార్థులు), జే (ఎక్స్‌చేంజ్ విజిటర్లు), ఐ (జర్నలిస్టులు) కేటగిరీ వీసాలకు నిర్దిష్ట కాలపరిమితిని అమలు చేయనున్నట్లు హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం (డీహెచ్‌ఎస్) ప్రకటించింది. కొత్త నిబంధనల ప్రకారం ఎఫ్, జే వీసాదారులు తమ విద్యా లేదా ఎక్స్‌చేంజ్ కార్యక్రమం పూర్తయ్యే వరకు మాత్రమే అమెరికాలో ఉండవచ్చు. అయితే ఆ కాలపరిమితి గరిష్ఠంగా నాలుగేళ్లు మాత్రమే ఉంటుంది. కోర్సు పూర్తి చేయడానికి అదనపు సమయం అవసరమైతే అమెరికా సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్)కు ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దశాబ్దాలుగా కొందరు విద్యార్థులు వరుసగా కోర్సుల్లో చేరుతూ అమెరికాలో నిరవధికంగా ఉంటున్నారని, కొత్త నిబంధనలతో అలాంటి దుర్వినియోగానికి అడ్డుకట్ట పడుతుందని డీహెచ్‌ఎస్ తెలిపింది. దీంతో వీసాదారులపై పర్యవేక్షణ మరింత బలోపేతం అవుతుందని పేర్కొంది. కోర్సు పూర్తయిన తర్వాత అమెరికా విడిచిపోవడానికి, మరో విద్యాసంస్థకు మారడానికి లేదా వీసా హోదా మార్చుకోవడానికి ఇప్పటివరకు ఉన్న 60 రోజుల గడువును 30 రోజులకు తగ్గించారు. ప్రస్తుతం పాత విధానంలో అమెరికాలో ఉన్న వీసాదారులు కూడా కొత్త నిబంధనల పరిధిలోకి వస్తారని డీహెచ్‌ఎస్ స్పష్టం చేసింది.

### గ్రీన్‌కార్డులపైనా కఠిన నిబంధనలు

అమెరికాలో శాశ్వత నివాస హోదా (గ్రీన్‌కార్డు) కోరే వలసదారులపై ట్రంప్ ప్రభుత్వం మరోసారి కఠిన నిబంధనలు అమలు చేయనుంది. పబ్లిక్ చార్జ్ పేరుతో గతంలో అమలు చేసిన విధానాన్ని పునరుద్ధరిస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఆధారపడే వారికి గ్రీన్‌కార్డు నిరాకరించే అవకాశాన్ని కల్పించింది. ఈ కొత్త నిబంధనలు జులై 20న అధికారికంగా ప్రచురించబడనున్నాయి. అమెరికా పౌరసత్వ, వలస సేవల సంస్థ తెలిపిన వివరాల ప్రకారం.. సెప్టెంబర్ 18 నుంచి ఈ విధానం అమల్లోకి వస్తుంది. ఫుడ్ స్టాంపులు, మెడికెయిడ్, హౌసింగ్ వౌచర్లు వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందిన వలసదారులు గ్రీన్‌కార్డు దరఖాస్తు సమయంలో అదనపు పరిశీలనకు లోనవుతారు. దరఖాస్తుదారులు అమెరికాపై భారం కాకుండా స్వయం సమృద్ధితో జీవించగలరని నిరూపించాల్సి ఉంటుంది. ఈ విధానంతో చట్టబద్ధ వలసలను కూడా నిరుత్సాహపరుస్తున్నారని వలస హక్కుల సంఘాలు విమర్శిస్తున్నాయి. దీనివల్ల అర్హత ఉన్నప్పటికీ అనేక మంది వలసదారులు, వారి కుటుంబాలు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమయ్యే ప్రమాదం ఉందని ప్రజారోగ్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అమెరికా పన్ను చెల్లింపుదారులపై భారం తగ్గించడం, ప్రభుత్వ వనరులను పరిరక్షించడం, స్వయం సమృద్ధి సూత్రాన్ని బలోపేతం చేయడమే ఈ నిర్ణయం లక్ష్యమని ట్రంప్ ప్రభుత్వం స్పష్టం చేసింది.

# పట్టాలెక్కనున్న తొట్టతొలి హైడ్రోజన్ రైలు

- నేడు జెండా ఊపి ప్రారంభించనున్న ప్రధాని మోదీ






**న్యూఢిల్లీ :** దేశంలో తొట్టతొలి హైడ్రోజన్ రైలు పట్టాలెక్కనున్నది. హర్యానాలోని జింద్ నుంచి ఆ రైలు ప్రారంభంకానున్నది. ప్రధాని మోదీ నేడు ఆ కొత్త రైలుకు పచ్చజెండా ఊపనున్నారు. హైడ్రోజన్ రైలు భారతీయ రైల్వే చరిత్రలో కొత్త అధ్యాయాన్ని లిఖించనున్నది. జింద్ నుంచి సోనిపట్ మధ్య ఆ రైలు నడవనున్నది. ఈ రెండు స్టేషన్ల మధ్య 89 కిలోమీటర్ల దూరం ఉంది. ఈ రైలులో మొత్తం 10 కోచ్‌లు ఉంటాయి. గరిష్టంగా 75 కిలోమీటర్ల వేగంతో వెళ్తుంది. చెన్నైలోని ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీలో దీన్ని డిజైన్ చేశారు. ఫ్యూయల్ సెల్ డీపీఆర్ఎస్ విధానంలో రైలు నడవనున్నది. 1200 కిలోవాట్ల ప్రొపల్షన్ సిస్టవ్ ఆ రైలుకు ఉంటుంది. 2025లో జింద్–సోనిపట మధ్య ట్రయల్స్ విజయవంతంగా నిర్వహించారు. మే 22వ తేదీన 10 కోచ్‌ల హైడ్రోజన్ రైలు కోసం రైల్వే బోర్డు అనుమతి ఇచ్చింది. హైడ్రోజన్ ట్రైన్ నెంబర్ 74010 జింద్ రైల్వే స్టేషన్ నుంచి ఉదయం 7.40 నిమిషాలకు బయలుదేరుతుంది. ఆ తర్వాత సోనిపేట్‌కు 9.40 నిమిషాలకు చేరుకుంటుంది. ఫ్యూయల్ సెల్స్ ఆధారంగా హైడ్రోజన్ రైలు విద్యుత్తను ఉత్పత్తి చేస్తుంది. హైడ్రోజన్, ఆక్సిజన్ మధ్య రియాక్షన్‌తో విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. ఆనోడ్‌పై హైడ్రోజన్, క్యాథోడ్‌పై ఆక్సిజన్ రియాక్ట్ అవుతుంది. ఆనోడ్‌లో హైడ్రోజన్ కణాలు.. ప్రోటాన్లు, ఎలక్ట్రాన్లుగా విభజన అవుతాయి. ప్లాటినం ఉత్ప్రేరకం ఆధారంగా ప్రోటాన్లతో ఆక్సిజన్ కలిసి వాటర్‌గా మారుతుంది. ఈ విధానంలో రైలు ఇంజిన్ నడుస్తుంది. హైడ్రోజన్ రైళ్లను 2018లో తొలిసారి జర్మనీలో ప్రవేశపెట్టారు. ఫ్రెంచ్ కంపెనీ ఆల్‌స్టావ్ వీటిని డెవలప్ చేశాయి. ఈ రైలు కోసం జింద్‌లో హైడ్రోజన్ జనరేషన్, రీఫ్యూయలింగ్ సిస్టవ్‌ను ఏర్పాటు చేశారు. కంప్రెస్డ్ హైడ్రోజన్ గ్యాస్ను నిల్వ చేసేందుకు పెట్రోలియం శాఖ లైసెన్సు జారీ చేసింది. మొత్తం 12 స్టేషన్లలో రైలు ఆగుతుంది. జింద్ సిటీ, పాండు పిండర, లలిత్ ఖేరా, భంబేవా, ఇషాపూర్ ఖేరి, బూటానా, ఖంద్రా యి, గోహనా, రత్రా, లాత్, మోహనా హర్యానా, భర్వాస్ని స్టేషన్లలో ఆ రైలు ఆగనున్నది. శిలాజ ఇంధనాల తరహాలో హైడ్రోజన్ మూడు రెట్ల శక్తిని ఉత్పత్తి చేస్తుంది. అయితే ప్రస్తుతం ఈ విశ్వంలో హైడ్రోజన్ ఎక్కువ స్థాయిలో లభిస్తుంది. దీన్ని ఇంధనంగా వాడితే, అది వలం నీటి ఆవిరిని, వేడిని మాత్రమే బై ప్రోడక్ట్‌గా రిలీజ్ చేస్తుందని చెబుతున్నారు. దీని వల్ల పర్యావరణం పరిశుభ్రంగా ఉంటుందని భావిస్తున్నారు.

# అంతరిక్ష రంగంలో కొత్త అధ్యాయం

- రేపు స్కైరూట్ 'విక్రమ్-1' తొలి ఆర్బిటల్ రాకెట్ ప్రయోగం
- శ్రీహరికోట నుంచి ఉదయం 11.30 గంటలకు 'మిషన్ ఆగమన్'




**ప్రజానావ, హైదరాబాద్:** భారత్ అంతరిక్ష రంగంలో మరో కీలక ఘట్టానికి రంగం సిద్ధమైంది. హైదరాబాద్‌కు చెందిన ప్రైవేట్ అంతరిక్ష సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్ అభివృద్ధి చేసిన తొలి ఆర్బిటల్ రాకెట్ 'విక్రమ్-1'ను జులై 18న ఉదయం 11.30 గంటలకు శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ (ఎస్‌డీఎస్‌సీ-షార్) నుంచి ప్రయోగించనున్నారు. భారత భూభాగం నుంచి పూర్తిగా ప్రైవేట్ సంస్థ రూపొందించిన ఆర్బిటల్ రాకెట్ అంతరిక్షంలోకి వెళ్లడం ఇదే తొలిసారి. 'మిషన్ ఆగమన్' పేరుతో చేపడుతున్న ఈ ప్రయోగం ద్వారా ప్రపంచ వాణిజ్య ఉపగ్రహ ప్రయోగాల రంగంలో భారత ప్రైవేట్ అంతరిక్ష పరిశ్రమ అధికారికంగా అడుగుపెట్టనుంది. విక్రమ్-1కు సంబంధించిన అన్ని భూస్థాయి పరీక్షలు విజయవంతంగా పూర్తయ్యాయని, తొలి ప్రయోగం ద్వారా రాకెట్ పనితీరుపై కీలక సమాచారాన్ని సేకరించనున్నట్లు స్కైరూట్ సీఈఓ పవన్‌కుమార్ చందన తెలిపారు. ఏడంతస్తుల భవనం ఎత్తుతో రూపొందించిన విక్రమ్-1 పూర్తిగా కార్బన్ కాంపోజిట్ నిర్మాణం, స్వదేశీ 3డీ ప్రింటెడ్ ఇంజిన్లతో తయారైంది. ఇది 350 కిలోల వరకు బరువున్న చిన్న ఉపగ్రహాలను భూమికి సమీప కక్ష్యలోకి పంపగలదు. ఇప్పటికే తుది సాంకేతిక పరీక్షలు, ప్రయోగ ఏర్పాట్లు పూర్తయ్యాయని స్కైరూట్ వెల్లడించింది. 2022లో 'విక్రమ్-ఎస్' విజయానంతరం స్కైరూట్ చేపడుతున్న ఈ రెండో మిషన్ భారత ప్రైవేట్ అంతరిక్ష పరిశ్రమకు కొత్త మైలురాయిగా నిలవనుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# 'జీరో టాలరెన్స్' విధానమే ప్రభుత్వ లక్ష్యం

- అవినీతికి తావిస్తే పదవులు ఊడతాయి
- మంత్రులకు తమిళనాడు సీఎం విజయ్ వార్నింగ్
- లంచాలు అడిగితే ఫిర్యాదు చేయాలని ప్రజలకు పిలుపు
- వాట్సాప్ హెల్ప్‌లైన్, టోల్‌ఫ్రీ, ఈ-మెయిల్ ద్వారా ఫిర్యాదుల స్వీకరణ



**చెన్నై:** తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ అవినీతిపై కఠిన వైఖరిని మరోసారి స్పష్టం చేశారు. రాష్ట్రంలో అవినీతి రహిత పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొంటూ, అవినీతికి పాల్పడే మంత్రులపై ఎలాంటి రాజీ ఉండదని హెచ్చరించారు. అవినీతి ఆరోపణలు రుజువైతే వారి పదవులు తొలగిస్తామని కేబినెట్ సమావేశంలో స్పష్టం చేసినట్లు సమాచారం. సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశం అనంతరం న్యాయశాఖ మంత్రి ఆర్. నిర్మల్‌కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వంలో పర్సంటేజ్ (కమీషన్) అనే వ్యవహారానికి తావు లేదని తెలిపారు. ఎవరైనా లంచాలు డిమాండ్ చేస్తే టోల్‌ఫ్రీ నంబర్లు, అధికారిక ఈ-మెయిల్, వాట్సాప్ హెల్ప్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేయాలని ప్రజలను కోరారు. ఇటీవల కరూర్‌లో జరిగిన సభలో మాట్లాడిన విజయ్, ఎవరైనా లంచం అడిగితే నిరాకరించండి. మీకు నేను అండగా ఉంటాను అంటూ ప్రజలకు పిలుపునిచ్చారు. అవినీతిని నిర్మూలించడంలో ప్రజల భాగస్వామ్యం కీలకమని ఆయన పేర్కొన్నారు. అవినీతి నిరోధక చర్యల్లో భాగంగా ప్రభుత్వం ప్రత్యేక వాట్సాప్ హెల్ప్‌లైన్‌ను ప్రారంభించింది. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి ఫిర్యాదుల కోసం సంప్రదింపు వివరాలను ప్రదర్శించాలని ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. ఇదిలా ఉండగా, రహదారి పనుల బిల్లుల మంజూరుకు డబ్బు తీసుకుంటున్నట్లు వీడియో వైరల్ కావడంతో టీవీకే పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధిని పార్టీ నుంచి బహిష్కరించారు. అలాగే గ్రేటర్ చెన్నై కార్పొరేషన్‌కు చెందిన ఆరుగురు అధికారులను అవినీతి, టెండర్ అక్రమాలు, ఆర్థిక అవకతవకల ఆరోపణలపై సస్పెండ్ చేయగా, మరో నలుగురిపై విచారణ కొనసాగుతోంది.

## భవిష్యత్ పోలీసింగ్‌కు
# సైబర్ నేరాలే కేంద్రబిందువు

- ప్రతి పోలీస్ అధికారి సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకోవాలి
- ఏఐ, అత్యాధునిక టెక్నాలజీతో సైబర్ నేరాలకు చెక్ : డీజీపీ సీవీ ఆనంద్

– బాధితులు వెంటనే ఫిర్యాదు చేయాలని సూచన

**ప్రజానావ, హైదరాబాద్:** భవిష్యత్‌లో పోలీసింగ్ వ్యవస్థలో సైబర్ నేరాల దర్యాప్తే అత్యంత కీలక పాత్ర పోషించనుందని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. ప్రతి పోలీసు అధికారి సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడంతో పాటు సైబర్ దర్యాప్తులో నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. గురువారం తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో పనితీరుపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. సైబర్ నేరాల స్వరూపం వేగంగా మారుతున్న నేపథ్యంలో కృత్రిమ మేధ (ఏఐ), అడ్వాన్స్‌డ్ అనలిటిక్స్, అత్యాధునిక సాంకేతికతను వినియోగించి నేరాలను అరికట్టాలని అధికారులకు ఆదేశించారు. పెట్టుబడి మోసాలు, ఆన్‌లైన్ ట్రేడింగ్ స్కామ్‌లు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసిన ఆయన, సైబర్ మోసాలకు గురైన వారు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. సమీక్ష సందర్భంగా ఏఐ ఆధారిత సైబర్ కాల్ సెంటర్, సైబర్ ల్యాబ్, డిజిటల్ ఫోరెన్సిక్ విభాగం పనితీరును పరిశీలించిన డీజీపీ, బాధితులకు తక్షణ సహాయం అందించడంలో ఏఐ వినియోగాన్ని అభినందించారు. 2025లో రాష్ట్రంలో సైబర్ నేరాల వల్ల రూ.1,524 కోట్ల నష్టం నమోదైనా, 2024తో పోలిస్తే నగదు నష్టాలు 20 శాతం తగ్గాయని అధికారులు వివరించారు. అలాగే సేఫ్ సిటీ ప్రాజెక్టు కింద ఏఐ, స్మార్ట్ మానిటరింగ్, ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్ల వినియోగాన్ని మరింత విస్తరించాలని డీజీపీ ఆదేశించారు.

# రూ.1.18 కోట్ల గంజాయి స్వాధీనం

### ఈగల్ ఫోర్స్ దాడిలో ఇద్దరి అరెస్టు

**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ విభాగం ఈగల్ ఫోర్స్ (ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్) మరో భారీ గంజాయి రవాణాను అడ్డుకుంది. హైదరాబాద్ సమీపంలోని జాతీయ రహదారి-65పై నిర్వహిం చిన ప్రత్యేక తనిఖీల్లో లారీ కేబిన్‌లో రహస్యంగా తరలిస్తున్న 237 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అరెస్టు చేసింది. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.1.18 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు. పక్కా సమాచారంతో లారీని తనిఖీ చేసిన ఈగల్ ఫోర్స్ అధికారులు డ్రైవర్ కేబిన్‌లో దాచిన 10 గోనె సంచుల్లో గంజాయిని గుర్తించారు. విచారణలో ఈ మత్తు పదార్థాన్ని విశాఖపట్నం నుంచి హైదరాబాద్ మీదుగా పుణేకు తరలిస్తున్నట్లు వెల్లడైంది. ఈ కేసులో గంజాయి రవాణాకు ఆర్థిక సహకారం అందించిన ఫైనాన్షియర్, సరఫరాదారు, ప్యాడ్లర్ సహా మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

## బద్రీనాథ్ కానుకల లెక్కింపునకు
# కొత్త నిబంధనలు

- డ్రెస్‌కోడ్, సీసీటీవీ నిఘా తప్పనిసరి చేయాలి
- 18 పేజీల నివేదిక సమర్పించిన కమిటీ
- లెక్కింపు కేంద్రంలో పటిష్ఠ నిఘా, భక్తుల భాగస్వామ్యానికి సూచనలు



**ప్రజానావ, ఉత్తరాఖండ్:** ఉత్తరాఖండ్‌లోని ప్రముఖ బద్రీనాథ్ ఆలయంలో కానుకల దుర్వినియోగం జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై ఏర్పాటు చేసిన శ్రీ బద్రీనాథ్–కేదార్‌నాథ్ ఆలయ కమిటీ (బీకేటీసీ) విచారణ కమిటీ తన నివేదికను సమర్పించింది. ఆలయ కానుకల లెక్కింపు ప్రక్రియలో పారదర్శకత, భద్రతను మరింత బలోపేతం చేసేందుకు పలు కీలక సిఫారసులు చేసింది. బీకేటీసీ సీఈఓ సోహన్‌సింగ్ రంగడ్ తెలిపిన వివరాల ప్రకారం, నాలుగు సభ్యుల కమిటీ 18 పేజీల నివేదికను సమర్పించింది. కానుకల లెక్కింపు సమయంలో సిబ్బందికి ప్రత్యేక డ్రెస్‌కోడ్ అమలు చేయడం, లెక్కింపు కేంద్రంతో పాటు ఇతర ప్రాంతాల్లో అదనపు సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయడం, నిఘా వ్యవస్థను పటిష్ఠం చేయడం, భక్తుల భాగస్వామ్యంతో లెక్కింపు ప్రక్రియ నిర్వహించే విధానాన్ని రూపొందించడం వంటి సూచనలు నివేదికలో ఉన్నాయి. జూలై 2న సోషల్ మీడియాలో కానుకల దుర్వినియోగంపై ఆరోపణలు వైరల్ కావడంతో బీకేటీసీ విచారణకు ఆదేశించింది. ప్రాథమిక నివేదిక ఆధారంగా ఆలయ కమిటీ చైర్మన్ వ్యక్తిగత సహాయకుడు ప్రమోద్ నౌటియాల్‌ను సస్పెండ్ చేసి, అనంతరం కేసు నమోదు చేసి జూలై 13న అరెస్టు చేశారు. కానుకల నమోదు రిజిస్టర్‌లో ఓవర్‌రైటింగ్ జరిగినట్లు గుర్తించడంతో ఆలయ ఖజాంచీ సందేశ్ మెహతాను కూడా బదిలీ చేశారు. ఈ కేసులో మరికొందరి ప్రమేయంపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ కొనసాగిస్తోంది. చమోలీ డీఎస్పీ మదన్‌సింగ్ నేతృత్వంలోని సిట్ సీసీటీవీ దృశ్యాలను పరిశీలిస్తుండగా, తొలగించిన పాత ఫుటేజీని కూడా తిరిగి సేకరిస్తోంది. మరోవైపు, ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ కూడా సమాంతరంగా విచారణ కొనసాగిస్తూ, ఆలయ కానుకల నిర్వహణలో పారదర్శకత పెంచే చర్యలను పరిశీలిస్తోంది.

# ముదిరిన అమెరికా - ఇరాన్ ఉద్రిక్తతలు

- పరస్పర దాడులతో మధ్యప్రాచ్యంలో ఆందోళనకర పరిస్థితులు
- హర్మూజ్ జలసంధి మా రెడ్‌లైన్ అంటూ ఇరాన్ హెచ్చరిక

**దుబాయ్:** మధ్యప్రాచ్యంలో అమెరికా–ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రరూపం దాల్చాయి. ఇరాన్‌లోని పలు రక్షణ, క్షిపణి స్థావరాలపై అమెరికా వైమానిక దాడులు జరపగా, ప్రతిగా ఇరాన్ అమెరికా మిత్రదేశాలపై క్షిపణులు, డ్రోన్లతో దాడులకు దిగింది. దీంతో ప్రాంతంలో భద్రతా పరిస్థితులు ఆందోళనకరంగా మారాయి. అమెరికా బలగాలు టెహ్రాన్‌తో పాటు సెమ్నాన్, హర్మూజ్‌గాన్, ఖుజెస్తాన్, లోరెస్తాన్, సిస్తాన్-బలూచిస్తాన్ ప్రాంతాల్లోని సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నట్లు సమాచారం. హర్మూజ్ జలసంధి సమీపంలోని గ్రేటర్ టున్బ్ దీవిలోని రక్షణ కేంద్రాలపై కూడా దాడులు జరిగినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. దీనికి ప్రతిస్పందనగా హర్మూజ్ జలసంధిలో విదేశీ జోక్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, అది తమ రెడ్‌లైన్ అని ఇరాన్ సైన్యం స్పష్టం చేసింది. అవసరమైతే ప్రాంతంలోని కీలక మౌలిక సదుపాయాలపై విస్తృత స్థాయిలో దాడులు చేస్తామని హెచ్చరించింది. అలాగే అమెరికా దాడులకు ప్రతీకారంగా బహ్రెయిన్, జోర్డాన్, కువైట్‌లపై క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేసినట్లు వెల్లడించింది. ఇదిలా ఉండగా, హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతల ప్రభావం ప్రపంచ ఇంధన మార్కెట్లపై పడుతోంది. చమురు రవాణాకు అంతరాయం ఏర్పడటంతో బ్రెంట్ ముడి చమురు ధర బ్యారెల్‌కు 85 డాలర్లకు చేరగా, పలు చమురు నౌకలు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుంటున్నాయి. అయితే పరిస్థితి ఉద్రిక్తంగానే ఉన్నప్పటికీ శాంతి చర్చలకు ఇంకా అవకాశం ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా–ఇరాన్‌ల మధ్య చర్చలు జరిగేలా ప్రయత్నాలు కొనసాగుతున్నాయని పాకిస్థాన్ వెల్లడించింది.



## ముంబై లోకల్ రైళ్లలో
# ప్రయాణం ప్రమాదకరం

- ప్రయాణికుల భద్రతలో రైల్వే, మహారాష్ట్ర ప్రభుత్వం విఫలం
- రద్దీ రైళ్లలో వరుస హింసాత్మక ఘటనలు
- కాంగ్రెస్ ఎంపీ వర్షా గైక్వాడ్



**ప్రజానావ, ముంబై:** ముంబై లోకల్ రైళ్లలో ప్రయాణం రోజురోజుకూ అసురక్షితంగా మారుతోందని ముంబై కాంగ్రెస్ అధ్యక్షురాలు, లోక్‌సభ సభ్యురాలు వర్షా గైక్వాడ్ ఆరోపించారు. దాడులు, హత్యలు, మహిళలపై నేరాలు పెరుగుతున్నప్పటికీ ప్రయాణికుల భద్రతను కాపాడడంలో మహారాష్ట్ర ప్రభుత్వం, రైల్వే అధికారులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. ఇటీవల లోకల్ రైళ్లలో కత్తిపోటుతో ఓ యువకుడు హత్యకు గురికావడం, చిన్న గొడవలకే కత్తులతో దాడులు జరగడం, అంబర్‌నాథ్ సమీపంలో ప్రయాణికుడిపై దాడి వంటి ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. పదునైన ఆయుధాలతో వ్యక్తులు రైళ్లలో స్వేచ్ఛగా తిరుగుతున్నారని, మహిళా ప్రయాణికులు కూడా భయాందోళనలకు గురవుతున్నారని అన్నారు. ప్రతి ఘటన తర్వాత విచారణలు చేపడుతున్నప్పటికీ, భవిష్యత్తులో అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యల్లో అధికారులు విఫలమవుతున్నారని గైక్వాడ్ ఆరోపించారు. ప్రయాణికుల భద్రతపై రైల్వే అధికారులతో అనేక సమావేశాలు నిర్వహించినా ప్రజాప్రతినిధుల సూచనలను పట్టించుకోవడం లేదన్నారు.

### పార్లమెంట్‌లో మళ్లీ ప్రస్తావిస్తా

జులై 20 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ముంబై సబర్బన్ రైల్వే భద్రత అంశాన్ని మరోసారి లేవనెత్తనున్నట్లు ఆమె తెలిపారు. ఒకే రోజు రెండు ఘటనలు గురువారం ఉదయం మహిళల ఫస్ట్‌క్లాస్ బోగీలో సీటు వివాదం సందర్భంగా ఓ మహిళ తోటి ప్రయాణికులపై పెప్పర్ స్ప్రే చల్లగా, మరో ఘటనలో పరేల్–అంబర్‌నాథ్ లోకల్‌లో సీటు కోసం జరిగిన గొడవలో ముగ్గురు గాయపడ్డారు. ఈ ఘటనలు ముంబై లోకల్ రైళ్లలో భద్రతపై మరోసారి ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.




# ఇంగ్లండ్‌దే రెండో వన్డే

- నాలుగు వికెట్లతో టీమిండియాను చిత్తు చేసిన ఆతిథ్య జట్టు
- ఒంటరి పోరాటం చేసిన జో రూట్
- కోహ్లి, శ్రేయస్ అర్ధ సెంచరీలు వృథా

**కార్డిఫ్:** అనుభవజ్ఞుడు జో రూట్ మరోసారి తన క్లాస్‌ను చాటుకున్నాడు. అజేయంగా 99 పరుగులు చేసి ఇంగ్లండ్‌ను విజయ తీరాలకు చేర్చడంతో, గురువారం జరిగిన రెండో వన్డేలో భారత్‌పై ఆతిథ్య జట్టు నాలుగు వికెట్ల తేడాతో గెలుపొందింది. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 1-1తో సమం చేసిన ఇంగ్లండ్, ఆదివారం లార్డ్స్‌లో జరిగే నిర్ణయాత్మక మూడో వన్డేపై దృష్టి సారించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ 44 ఓవర్లలో 233 పరుగులకు ఆలౌట్ అయింది. విరాట్ కోహ్లి 65, శ్రేయస్ అయ్యర్ 66 పరుగులతో రాణించినా, మిగతా బ్యాటర్లు నిరాశపరిచారు. కెప్టెన్ రోహిత్ శర్మ 47 బంతుల్లో 26 పరుగులకే పరిమితమై మరోసారి పేలవ ఫామ్‌ను కొనసాగించాడు. ఇంగ్లండ్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్ (3/47), గస్ అట్కిన్సన్ (3/50), సాకిబ్ మహ్మూద్ (2/52) భారత బ్యాటింగ్‌ను కుప్పకూల్చారు. ఒక దశలో 178/3తో ఉన్న భారత్ కేవలం 26 బంతుల్లో 15 పరుగుల వ్యవధిలో నాలుగు వికెట్లు కోల్పోయి భారీ స్కోరు చేసే అవకాశాన్ని చేజార్చుకుంది.

### రూట్ మాస్టర్‌క్లాస్

234 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లండ్‌కు భారత పేసర్లు ఆరంభంలోనే షాక్ ఇచ్చారు. బుమ్రా, ప్రసిద్ధ్ కృష్ణ వరుస వికెట్లు తీయడంతో ఇంగ్లండ్ 125/5తో కష్టాల్లో పడింది. అయితే జో రూట్ ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ఇన్నింగ్స్‌ను చక్కగా నడిపించాడు. విల్ జాక్స్ (30)తో కలిసి ఆరో వికెట్‌కు 72 పరుగులు జోడించి మ్యాచ్‌ను ఇంగ్లండ్ వైపు తిప్పాడు. 133 బంతుల్లో 99 పరుగులతో అజేయంగా నిలిచిన రూట్ సెంచరీకి ఒక్క పరుగు దూరంలో నిలిచిపోయాడు. గస్ అట్కిన్సన్ విజయం సాధించే బౌండరీ కొట్టడంతో రూట్‌కు శతకం చేజారింది. ఇంగ్లండ్ 44.1 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఈ విజయంతో సిరీస్‌లో ఇరు జట్లు 1-1తో సమంగా నిలవడంతో ఆదివారం లార్డ్స్‌లో జరిగే మూడో వన్డే నిర్ణయాత్మకంగా మారింది.




## లార్డ్స్ వన్డేనే రోహిత్‌కు చివరిదా?

- ఇంగ్లండ్ సిరీస్ తర్వాత రోహిత్ శర్మను కొనసాగించే ఆలోచనలో లేని సెలెక్టర్లు
- విరాట్‌కు గ్రీన్ సిగ్నల్.. హిట్‌మ్యాన్ భవిష్యత్‌పై తుది నిర్ణయం అతనిదే
- యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌కు అవకాశాలివ్వాలని నిర్ణయం

**న్యూఢిల్లీ:** ఇంగ్లండ్‌తో ఆదివారం లార్డ్స్‌లో జరిగే మూడో వన్డే భారత కెప్టెన్ రోహిత్ శర్మ అంతర్జాతీయ కెరీర్‌లో చివరి మ్యాచ్ కావచ్చని తెలుస్తోంది. ఇంగ్లండ్ సిరీస్ అనంతరం రోహిత్‌ను కొనసాగించే ఉద్దేశం జాతీయ సెలక్షన్ కమిటీకి లేదని బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. గత ఎనిమిది వన్డేల్లో రోహిత్ 241 పరుగులు మాత్రమే చేయగా, సగటు 30.1గా ఉంది. వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌కు వరుస అవకాశాలు ఇవ్వాలని సెలెక్టర్లు భావిస్తున్నట్లు సమాచారం. సెలక్షన్ కమిటీ చైర్మన్ అజిత్ అగార్కర్ ప్రస్తుతం కార్డిఫ్‌లో జట్టుతో ఉన్నారు. సెప్టెంబరులో వెస్టిండీస్‌తో జరిగే స్వదేశీ సిరీస్ నుంచి యువ ఆటగాళ్లకు ప్రాధాన్యం ఇవ్వాలన్న అభిప్రాయంలో సెలెక్టర్లు ఉన్నట్లు తెలుస్తోంది. రోహిత్ భవిష్యత్‌పై తుది నిర్ణయం మాత్రం ఆయనే తీసుకోవాల్సి ఉంటుందని బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి. అయితే ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, అజిత్ అగార్కర్ మాత్రం విరాట్ కోహ్లి ఫామ్, ఫిట్‌నెస్‌ను దృష్టిలో ఉంచుకుని అతనిపై పూర్తి విశ్వాసంతో ఉన్నట్లు సమాచారం.

## సీఎస్‌కేనే నాకు సరైన జట్టు

- రాజస్థాన్ రాయల్స్‌ను వీడడం కెరీర్‌లో అత్యంత కఠిన నిర్ణయం
- ధోనీ, రుతురాజ్‌తో అనుబంధమే చెన్నైకు రావడానికి కారణం
- భారత వికెట్‌కీపర్ సంజూ శాంసన్

**న్యూఢిల్లీ:** ఐపీఎల్‌లో దశాబ్దానికి పైగా ప్రాతినిధ్యం వహించిన రాజస్థాన్ రాయల్స్‌ను వీడటం తన కెరీర్‌లో అత్యంత కఠిన నిర్ణయమని భారత వికెట్‌కీపర్-బ్యాటర్ సంజూ శాంసన్ వెల్లడించాడు. అయితే మహేంద్రసింగ్ ధోనీ ప్రభావం, రుతురాజ్ గైక్వాడ్‌తో ఉన్న సాన్నిహిత్యం కారణంగా చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే)లో చేరడం సరైన నిర్ణయంగా భావించానని తెలిపాడు. ఐపీఎల్ 2025 సీజన్ ముగిసిన తర్వాత రాజస్థాన్ యువ ఆటగాళ్లు బాధ్యతలు తీసుకునే స్థాయికి చేరుకున్నారని భావించి జట్టును వీడాలని నిర్ణయించుకున్నట్లు సంజూ చెప్పాడు. సీఎస్‌కేతో పాటు మరో రెండు మూడు అవకాశాలు ఉన్నప్పటికీ, తన ఆటతీరుకు చెన్నై ఫ్రాంచైజీయే సరైన వేదికగా అనిపించిందని పేర్కొన్నాడు. చిన్నప్పటి నుంచే మహేంద్రసింగ్ ధోనీ తన ఆరాధ్య క్రికెటర్ అని, ఆయనతో కలిసి భారత్‌కు ఆడాలని కలలు కనేవాడినని సంజూ గుర్తు చేసుకున్నాడు. ఇప్పుడు సీఎస్‌కేలో చేరిన తర్వాత ధోనీతో కలిసి బ్యాటింగ్ చేయాలన్న తన కల నెరవేరుతుందనే ఆశాభావం వ్యక్తం చేశాడు. తన ఐపీఎల్ అరంగేట్రాన్ని గుర్తుచేసుకున్న సంజూ, తొలి సీజన్‌లో ఎక్కువ రోజులు బెంచ్‌కే పరిమితమైనట్లు చెప్పాడు. వికెట్‌కీపర్ దిశాంత్ యాజ్ఞిక్ గాయపడటంతో 2013లో పంజాబ్‌పై అరంగేట్రం చేశాడు.



## జియో ఫైనాన్స్‌కు భారీ లాభాలు

- ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో రూ.830 కోట్ల నికర లాభం నమోదు
- 150 శాతం వృద్ధి నమోదు
- మూడు రెట్లు పెరిగిన ఆదాయం
- పెట్టుబడులు, బీమా రంగాల్లో విస్తరణకు సిద్ధం




ముంబై: రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ 2026-27 ఆర్థిక సంవత్సర తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో అద్భుత ఆర్థిక ఫలితాలు నమోదు చేసింది. కంపెనీ ఏకీకృత నికర లాభం రూ.830 కోట్లకు చేరగా, గతేడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.325 కోట్లతో పోలిస్తే 150 శాతం వృద్ధి నమోదైంది. కంపెనీ మొత్తం ఆదాయం కూడా గణనీయంగా పెరిగింది. గతేడాది రూ.619 కోట్లుగా ఉన్న ఆదాయం ఈసారి రూ.2,005 కోట్లకు చేరి మూడు రెట్లు పెరిగింది. వడ్డీ ఆదాయం రూ.363 కోట్ల నుంచి రూ.962 కోట్లకు పెరగగా, వ్యాపార విస్తరణ నేపథ్యంలో మొత్తం ఖర్చులు రూ.261 కోట్ల నుంచి రూ.1,016 కోట్లకు పెరిగాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ నుంచి విడిపోయిన అనంతరం జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ పెట్టుబడులు, ఫైనాన్సింగ్, ఇన్సూరెన్స్ బ్రోకింగ్, పేమెంట్స్ బ్యాంక్, పేమెంట్ అగ్రిగేటర్, పేమెంట్ గేట్‌వే సేవల రంగాల్లో కార్యకలాపాలను విస్తరిస్తోంది. ఈ సందర్భంగా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ హితేష్ సేథియా మాట్లాడుతూ, పెట్టుబడి పరిష్కారాలు (ఇన్వెస్ట్‌మెంట్ సొల్యూషన్స్), బీమా తదితర రంగాల్లో మరింత విస్తరణ చేపట్టనున్నట్లు తెలిపారు. బ్లాక్‌రాక్, అలియాంజ్‌తో ఏర్పాటు చేసిన జాయింట్ వెంచర్లతో పాటు కొత్త వ్యాపార అవకాశాలను కూడా అందిపుచ్చుకుని, రాబోయే రోజుల్లో మరింత మెరుగైన ఫలితాలు సాధిస్తామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.




## మార్కెట్లపై భౌగోళిక ఉద్రిక్తతల ప్రభావం

- సెన్సెక్స్ స్వల్ప లాభం.. నిఫ్టీ నష్టం
- ఊగిసలాటలో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు

**ముంబై:** పశ్చిమాసియా ఉద్రిక్త పరిస్థితులు, అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు పెరగడం ప్రభావంతో దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం ఒడిదుడుకుల మధ్య ముగిశాయి. అమెరికా-ఇరాన్ మధ్య మరోసారి ఉద్రిక్తతలు పెరిగి ప్రాంతీయ యుద్ధానికి దారితీయొచ్చనే ఆందోళనలు ప్రపంచ మార్కెట్లపై ప్రభావం చూపడంతో మదుపర్ల సెంటిమెంట్ బలహీనపడింది. ఈ నేపథ్యంలో బీఎస్‌ఈ సెన్సెక్స్ 1.44 పాయింట్లు లాభపడి 77,186.87 వద్ద ముగియగా, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 5.75 పాయింట్లు నష్టపోయి స్వల్ప నష్టాలతో ముగిసింది. సెన్సెక్స్‌లో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇండిగో, బజాజ్ ఫైనాన్స్, మారుతీ సుజుకి, మహీంద్రా అండ్ మహీంద్రా, ఐటీసీ షేర్లు లాభపడగా, ఎటర్నల్, బీఈఎల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎన్‌టీపీసీ, ట్రెంట్ తదితర కంపెనీల షేర్లు నష్టాలను చవిచూశాయి. విదేశీ మారక మార్కెట్లో డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ రూ.96.34 వద్ద కొనసాగింది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ చమురు ధర బ్యారెల్‌కు 84.76 డాలర్లు వద్ద ట్రేడవుతుండగా, బంగారం ఔన్స్ ధర 4,033 డాలర్ల వద్ద కొనసాగుతోంది. ఇక ఆసియా మార్కెట్లలోనూ బలహీన ధోరణి కనిపించింది. దక్షిణ కొరియా కోస్పి, జపాన్ నిక్కీ సూచీలు నష్టాలతో ముగియడంతో ప్రపంచ మార్కెట్లపై భౌగోళిక ఉద్రిక్తతల ప్రభావం స్పష్టంగా కనిపించింది.

Business
బిజినెస్

## ఎస్‌బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్ ఐపీఓకు భారీ స్పందన

- 41.66 రెట్లు సబ్‌స్క్రిప్షన్
- రూ.2.97 లక్షల కోట్ల విలువైన బిడ్లు
- 65 లక్షల దరఖాస్తులతో అత్యధిక స్పందన
- జూలై 21న షేర్ల లిస్టింగ్




**న్యూఢిల్లీ:** ఎస్‌బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్ ప్రారంభించిన ప్రారంభ పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)కు మదుపర్ల నుంచి అనూహ్య స్పందన లభించింది. ముగింపు రోజైన గురువారం నాటికి ఈ ఐపీఓ మొత్తం 41.66 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. రూ.9,812 కోట్ల ఐపీఓకు గాను సుమారు రూ.2.97 లక్షల కోట్ల విలువైన బిడ్లు నమోదయ్యాయి. మొత్తం 12.45 కోట్ల షేర్లకు గాను 518 కోట్లకు పైగా షేర్ల కోసం బిడ్లు దాఖలయ్యాయి. అలాగే సుమారు 65 లక్షల అప్లికేషన్లు రావడం ఈ ఏడాదిలో ఏ ఐపీఓకైనా నమోదైన అత్యధిక దరఖాస్తులుగా నిలిచింది. క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బిడ్డర్ల విభాగం అత్యధికంగా 140.11 రెట్లు సబ్‌స్క్రిప్షన్ సాధించింది. నాన్-ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్ల (కోటా 22.51 రెట్లు, రిటైల్ ఇన్వెస్టర్ల విభాగం 3.60 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. ఐపీఓకు ముందు యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి కంపెనీ రూ.2,663 కోట్లు సమీకరించింది. ఒక్కో షేరు ధరను రూ.545 నుంచి రూ.574 మధ్య నిర్ణయించింది. ఈ ఐపీఓ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (OFS) విధానంలో నిర్వహించగా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), అముండి సంయుక్తంగా తమ 10 శాతం వాటాను విక్రయించాయి. ఈ షేర్లు జూలై 21న స్టాక్ మార్కెట్లలో లిస్ట్ కానున్నాయి.

## విప్రోకు స్వల్ప లాభాల వృద్ధి

- ఆదాయంలో 10.7% పెరుగుదల
- మొదటి త్రైమాసికంలో రూ.3,352 కోట్ల నికర లాభం
- ఒక్కో షేరుకు రూ.2 మధ్యంతర డివిడెండ్
- రెండో త్రైమాసికానికి సానుకూల అంచనాలు

**బెంగళూరు:** ప్రముఖ ఐటీ సంస్థ విప్రో 2026-27 ఆర్థిక సంవత్సర తొలి త్రైమాసిక (ఏప్రిల్-జూన్) ఫలితాలను ప్రకటించింది. ఈ కాలంలో కంపెనీ నికర లాభం రూ.3,352 కోట్లు నమోదు చేసింది. గతేడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.3,330.4 కోట్లతో పోలిస్తే 0.6 శాతం స్వల్ప వృద్ధి నమోదైంది. కార్యకలాపాల ద్వారా వచ్చిన ఆదాయం 10.7 శాతం పెరిగి రూ.24,478.6 కోట్లకు చేరింది. గతేడాది ఇదే కాలంలో ఈ ఆదాయం రూ.22,134.6 కోట్లుగా నమోదైంది. ఫలితాల సందర్భంగా విప్రో సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్ పల్లియా మాట్లాడుతూ, సంస్థ అందిస్తున్న కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత సేవలు క్లయింట్ల వ్యాపార అభివృద్ధికి ఉపయోగపడుతున్నాయని, దీంతో కంపెనీపై వారి విశ్వాసం మరింత పెరిగిందని తెలిపారు. రెండో త్రైమాసికానికి సంబంధించి కంపెనీ సానుకూల అంచనాలను వెల్లడించింది. ఈ కాలంలో ఆదాయం 2,574 మిలియన్ డాలర్ల నుంచి 2,627 మిలియన్ డాలర్ల మధ్య ఉండవచ్చని, వృద్ధి -1.5 శాతం నుంచి +0.5 శాతం మధ్య నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. అలాగే, ఒక్కో ఈక్విటీ షేరుపై రూ.2 చొప్పున మధ్యంతర డివిడెండ్ చెల్లింపునకు డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపింది.





## ప్రభాస్ అంటే.. మాంచి భోజనం గుర్తుకొస్తుంది

స్టార్ హీరోయిన్ పూజా హెగ్డే తాజాగా ప్రభాస్ గురించి చెప్పిన మాటలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ప్రభాస్‌తో కలిసి రాధేశ్యావ్ సినిమాలో నటించిన రోజులను గుర్తు చేసుకుంటూ ప్రభాస్ వ్యక్తిత్వం, ఆయన ఆతిథ్యం గురించి ఆమె చేసిన వ్యాఖ్యలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఇటీవల పూజా ఓ మీడియాకు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో పూజా హెగ్డే మాట్లాడుతూ.. 'ప్రభాస్ పేరు చెప్పగానే నాకు ముందుగా గుర్తొచ్చేది భోజనమే అని ఆయన భోజనాన్ని దొంగిలించాలనిపిస్తుందని అన్నారు. రాధేశ్యావ్ షూటింగ్ సమయంలో ఆయన పంపించే ఫుడ్ డబ్బా కోసం అందరం ఎదురు చూసేవారని.. నాకు డా ప్రతిరోజూ ఎంతో రుచికరమైన వంటకాలు పంపించేవారు' అని చెప్పారు.ఆమె ఇంకా మాట్లాడుతూ.. 'రాధేశ్యావ్ షూటింగ్‌కు సంబంధించిన ఎన్నో జ్ఞాపకాలు ఉన్నాయి. కానీ వాటిలో నాకు ఎక్కువగా గుర్తుండిపోయింది ప్రభాస్ పంపించే భోజనమే. ఆయన పంపించే డబ్బా ఎప్పుడూ ప్రత్యేకంగా ఉండేది. ఎంతో ప్రేమగా అందరికీ ఆహారం పంపించేవారు. నాకు డా చాలా రకాల వంటకాలు తినిపించారు. ఆ ఆతిథ్యాన్ని ఎప్పటికీ మర్చిపోలేను' అని తెలిపారు. ఇదిలాఉంటే.. ప్రభాస్ షూటింగ్ సెట్స్‌లో తన సమచర నటులు, సాంతిక నిపుణులకు ఇంటి భోజనం పంపించడం కొత్త విషయం కాదు. ఇప్పటి సైఫ్ అలీఖాన్, కరీనా కపూర్, శ్రద్ధా కపూర్, పృథ్వీ రాజ్ సుకుమారన్ వంటి స్టార్లు ఆయన ఆతిథ్యానికి ఫిదా అయ్యారు. ఇప్పుడు పూజా హెగ్డే డా అదే విషయాన్ని మరోసారి ప్రస్తావించడంతో ప్రభాస్ అభిమానులు రాజు ఎక్కడ ఉన్నా రాజేరా అంటూ ఈ వ్యాఖ్యలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు.

## వంటలతో కాలక్షేపం చేస్తున్న 'మా ఇంటి బంగారం'



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత వ్యక్తిగత జీవితంలో చోటుచేసుకుంటున్న మార్పులు అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ఒకప్పుడు తనకు వంట చేయడం పెద్దగా రాదని, కిచెన్‌లో గడపడం కంటే షూటింగ్‌లు, కెరీర్‌పైనే ఎక్కువ దృష్టి పెట్టేదానినని చెప్పిన సమంత.. ఇప్పుడు పూర్తిగా మారినట్టు కనిపిస్తుంది. ప్రస్తుతం ఆమె రాయలసీమ సంప్రదాయ వంటకాలను నేర్చుకోవడంలో ఆసక్తి చూపుతున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. సమంత సన్నిహితుల సమాచారం ప్రకారం, ప్రస్తుతం ఆమె ఇంట్లోనే ఎక్కువ సమయం గడుపుతూ రాయలసీమ ప్రత్యేక వంటకాలను నేర్చుకుంటున్నారట. ఘాటు రుచులు, ప్రత్యేకమైన మసాలాలు, సంప్రదాయ తయారీ విధానాలతో ప్రసిద్ధి చెందిన సీమ వంటలను ఎంతో ఆసక్తిగా నేర్చుకుంటూ, స్వయంగా తయారు చేసి రుచి చూస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆమె ప్రశాంతమైన కుటుంబ జీవితాన్ని ఆస్వాదిస్తూ, ఇంటి వాతావరణంలో ఎక్కువ సమయం గడుపుతున్నారు. దీంతో గతంలో చేయలేకపోయిన ఎన్నో విషయాలను ఇప్పుడు ఆసక్తిగా నేర్చుకుంటున్నారని సమాచారం. ప్రస్తుతం ప్రెగ్నెంట్‌గా ఉన్న సమంత బయట కార్యక్రమాలను తగ్గించి విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విరామ సమయంలో వంటపై దృష్టి పెట్టడం ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఆరోగ్యకరమైన, ఇంట్లో తయారైన ఆహారం ఈ సమయంలో ఎంతో పయోగపడుతుందని భావిస్తూ, పోషకాహారంతో డిన సంప్రదాయ వంటకాలను నేర్చుకుంటున్నారని సన్నిహితులు చెబుతున్నారు. తెలుగు కుటుంబంలో కొత్త జీవితాన్ని ప్రారంభించిన తర్వాత తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు, స్థానిక వంటకాలపై సమంతకు మరింత ఆసక్తి పెరిగిందని ఇండస్ట్రీ వర్గాలు పేర్కొంటున్నాయి. ముఖ్యంగా రాయలసీమ వంటకాల ప్రత్యేక రుచిని ఆమె ఎంతో ఇష్టపడుతున్నట్లు సమాచారం. కుటుంబ సభ్యుల కోసం స్వయంగా వంట చేసి వడ్డించడం ద్వారా కొత్త ఆనందాన్ని పొందుతున్నారని తెలుస్తోంది. ఇటీవల విడుదలైన 'మా ఇంటి బంగారం' చిత్రంలో ఓ ఇంటి కోడలిగా సమంత ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. సినిమాలో కుటుంబానికి అండగా నిలిచే పాత్రలో కనిపించిన ఆమె.. ఇప్పుడు నిజ జీవితంలో డా కుటుంబంతో కలిసి గడుపుతూ, వంటకాలు నేర్చుకోవడం ద్వారా మరో కొత్త కోణాన్ని పరిచయం చేస్తున్నట్లు అభిమానులు భావిస్తున్నారు.



## 4 నిమిషాల 'రామాయణ' విజువల్ వండర్

భారతీయ సినీ ప్రేక్షకులతో పాటు ప్రపంచవ్యాప్తంగా సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో 'రామాయణ' ఒకటి. దర్శకుడు నితీష్ తివారి తెరకెక్కిస్తున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో రణబీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయి పల్లవి సీతాదేవిగా నటిస్తున్నారు. అత్యున్నత సాంకేతిక విలువలతో రూపొందుతున్న ఈ చిత్రం ఇప్పటికే భారీ అంచనాలను సొంతం చేసుకుంది. చిత్ర ట్రైలర్‌ను జూలై 24న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. తాజా సమాచారం ప్రకారం, ఈ ట్రైలర్ నిడివి సుమారు 4 నిమిషాలు ఉండనుండగా, సెన్సార్ ప్రక్రియ పూర్తై యూ (U) సర్టిఫికెట్ కూడా పొందినట్లు బాలీవుడ్ వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఈ ట్రైలర్‌ను విజువల్ వండర్‌గా తీర్చిదిద్దినట్లు సమాచారం. ముఖ్యంగా సినిమా స్థాయిని ప్రతిబింబించేలా అద్భుతమైన విజువల్స్, గ్రాఫిక్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకునేలా రూపొందించినట్లు తెలుస్తోంది. అయితే ట్రైలర్ ప్రేక్షకులను ఎంతవరకు మెప్పిస్తుందో తెలుసుకోవాలంటే జూలై 24 వరకు వేచి చూడాల్సిందే.

## డిసెంబర్ 3న ప్రభాస్ ఫౌజీ



ప్రభాస్ హీరోగా వస్తోన్న ఫౌజీ రిలీజ్ డేట్ ఫిక్స్ అయ్యింది. హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'ఫౌజీ' సినిమా కోసం ప్రభాస్ అభిమానులతో పాటు సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా టీవ్ వారికి అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చింది. ఈ చిత్ర విడుదల తేదీ ప్రకటించింది. డిసెంబర్ 3న 'ఫౌజీ' విడుదల కానున్నట్లు తెలుపుతూ ఓ కొత్త పోస్టర్ పంచుకుంది. 'అజ్ఞాతపర్వం ముగిసింది.. ఇక తిరుగుబాటు మొదలైంది..' అంటూ పంచుకున్న ఆ పోస్టర్‌లో '1932 నుంచి మోస్ట్ వాంటెడ్ జాబితాలో ఉన్నాడు' అని రాసి ఉన్న స్టాంప్ ఆకట్టుకుంటోంది. ఇందులో ప్రభాస్ మునుపెన్నడూ చూడని లుక్‌లో కన్పించాడు. యుద్ధంలో ఒంటి నిండా రక్తంతో, తుపాకీపై చేయి పెట్టి ర్చొని ఉన్న పోస్టర్ సినిమాపై ఆసక్తిని పెంచేలా ఉంది. ప్రభాస్‌కు జోడీగా ఇమాన్వి నటిస్తోంది. మిథున్ చక్రవర్తి, అనుపవ్ ఖేర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం దీని షూటింగ్ చివరి దశలో ఉంది. 75 శాతం షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రంలో మరో మూడు యాక్షన్ ఘట్టాలతో పాటు కొన్ని కీలక సన్నివేశాలు తెరకెక్కించాల్సి ఉంది. ఇక ఈ సినిమా నుంచి త్వరలోనే ఓ లిరికల్ సాంగ్‌ను డా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. 'సీతారామం' తర్వాత ఫౌజీ కథను రాయడాని సుమారు ఏడాదికి పైగా సమయం పట్టిందని గతంలో హను రాఘవపూడి తెలిపారు. ప్రేక్షకులు తప్పకుండా సర్‌ప్రైజ్ ఫీలవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## శ్రద్ధాకపూర్ 'ఈఠ' వాయిదా!

బాలీవుడ్ కథానాయిక శ్రద్ధా కపూర్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న 'ఈఠ' చిత్రం విడుదల వాయిదా పడనున్నట్లు బాలీవుడ్ వర్గాల్లో వార్తలు వినిపిస్తున్నాయి. ఇటీవలే "తుపాను నాట్యం చేయడం చూడాలనుకుంటే.. 'ఈఠ'ని చూడాల్సిందే" అంటూ చిత్రాన్ని ప్రకటించిన చిత్రబృందం, ఆగస్టు 28న సినిమాను విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. అయితే తాజా సమాచారం ప్రకారం, కొన్ని అనివార్య కారణాల వల్ల చిత్ర విడుదలను వాయిదా వేయాలని నిర్మాతలు నిర్ణయించినట్లు తెలుస్తోంది. దీనిపై త్వరలో అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. 'ఛావా' ఫేమ్ దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం మహారాష్ట్రకు చెందిన ప్రముఖ జానపద కళాకారిణి 'విఠాబాయి' జీవిత కథ ఆధారంగా రూపొందుతోంది. శ్రద్ధా కపూర్ ఇందులో విఠాబాయి పాత్రలో కనిపించనుండగా, చిత్రంపై ఇప్పటికే ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది.



## నా ఫొటోలు తీయొద్దు ప్లీజ్

బాలీవుడ్ నటి మౌనీరాయ్ ఇటీవల ముంబయిలో ఫొటోగ్రాఫర్లపై అసహనం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. రెస్టారెంట్ నుంచి బయటకు వచ్చి కారు ఎక్కిన తర్వాత కూడా ఆమెను కారు అద్దంలో నుంచి కెమెరామెన్‌లు క్లిక్ చేశారు. దీంతో మౌనీరాయ్ వాళ్లను వారించారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్లు విమర్శలు కురిపించారు. దీనిపై తాజాగా ఆమె వివరణ ఇస్తూ పోస్ట్ పెట్టారు. 'నాకు ఫొటోగ్రాఫర్లంటే చాలా గౌరవం ఉంది. కానీ, దయచేసి నన్ను ఫొటోలు తీయకండి. నేను చాలా రోజుల నుంచి మిమ్మల్ని పిలవడం లేదు. ఇకపై డా పిలవను. నాకోసం ఎప్పుడూ రాకండి. మీపై గౌరవంతోనే ఈ మాటలు చెబుతున్నా' అని నటి పేర్కొన్నారు. అయితే, కొద్దిసే పటి ఆమె ఈ పోస్ట్‌ను డిలీట్ చేసిన ప్పటికీ.. ఆ స్క్రీన్ షాట్‌లు వైరల్ అయ్యాయి. కొందరు ఆమెను ట్రోల్ చేస్తుండగా.. సెలబ్రిటీలకు డా వ్యక్తిగత గోప్యత ఉంటుందని మరికొందరు నెటిజన్లు నటికి మద్దతుగా నిలుస్తున్నారు. ప్రస్తుతం మౌనీ రాయ్ 'విశ్వంభర'లో ఓ ప్రత్యేకపాటతో అలరించను న్నారు. ఇందులో చిరు సరసన స్పెషల్ సాంగ్ చేశారు. దీంతో పాటు భండార్కర్ దర్శకత్వంలో రాబోతున్న 'ది వైఫ్స్' చిత్రంలో నటిస్తున్నారు.

## 23న జననాయగన్ రిలీజ్



తమిళనాడు ముఖ్యమంత్రి, కథానాయకుడు విజయ్ అభిమానులకు శుభవార్త. ఆయన కీలక పాత్రలో నటించిన ఆఖరి చిత్రం 'జన నాయగన్' విడుదల తేదీ ఖరారైంది. జులై 23న ఈ మూవీ విడుదల చేయనున్నట్లు ఓ టికెట్ బుకింగ్ యాప్ ప్రకటించింది. 24న విడుదలవుతుందని తొలుత ప్రకటించారు. కానీ ఒకరోజు ముందే వస్తోంది. దీంతో సామాజిక మాధ్యమాల వేదికగా విజయ్ అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రావాల్సిన ఈ మూవీ సెన్సార్ సమస్య కారణంగా వాయిదా పడుతూ వచ్చింది. ఈ మధ్యలో కోర్టు సులు, విచారణలు, సీబీఎఫ్‌సీపునః పరిశీలన తర్వాత ఇటీవల సెన్సార్ పూర్తి చేసుకుంది. ఈ చిత్రానికి 'ఏ' సర్టిఫికెట్‌ను సెన్సార్ బోర్డు జారీ చేసింది. దాదాపు 183 నిమిషాల నిడివితో 'జన నాయగన్' ప్రేక్షకుల ముందుకు రానుంది. హెచ్.వినోద్ దర్శకత్వంలో ముస్తాబైన ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ని వీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె.నారాయణ నిర్మించారు. పూజా హెగ్డే కథానాయిక. మమితా బైజు కీలక పాత్ర పోషించింది.

## ఆగస్టు 15న రానున్న 'హుషారు పిట్టలు'




అన్న, వాసవి గణేశిషన్ కాంబోలో రూపొందుతోన్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'హుషారు పిట్టలు'. పద్మ అమ్మ, బీవీజీ స్టూడియోస్ సమర్పణలో రుద్రక్రాంతి పిక్చర్స్ పతాకంపై వెంకట్ యాదవ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి బిక్షు దర్శకుడు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థలు ఏషియన్ సురేష్ ఫిలింస్ సంస్థలు విడుదల చేస్తున్నాయి. ఆగస్టు 15న ఈ చిత్రాన్ని థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నారు. ఇటీవల విడుదల చేసిన ఈ చిత్రం టీజర్‌కు అనూహ్యమైన స్పందన వచ్చింది. కాగా తాజా ఈ చిత్రం నుంచి టోంగా టోంగా అనే ఓ హుషారు గీతాన్ని బుధవారం విడుదల చేశారు. చరణ్ అర్జున్ సంగీత దర్శకత్వంలో ఎస్.ఎస్.చిరంజన్ సాహిత్యంతో, మెయిన్ కొరియోగ్రఫీతో ఈ పాట తెరకెక్కింది.దర్శకుడు బిక్షు మాట్లాడుతూ.. ఈ సినిమా టీజర్ తరువాత నన్ను అందరూ సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తూ తిట్టడం స్టార్ట్ చేసి నన్ను పాపులర్ చేశారు. అందరూ ఏదోదో ఊహించుకున్నారు. ఈ సినిమా విడుదల తరువాత సినిమా చూసి అందరూ మీరు సోషల్ మీడియాలో చేసిన నెగెటివ్ కామెంట్స్ వెనక్కి తీసుకుంటారు. అయితే ఇదే సినిమాను ఏ తమిళంలో, మలయాళంలో తీసి టీజర్‌ను విడుదల చేస్తే అందరూ ప్రశంసించేవారు. కానీ తెలుగు వాళ్లు మనకు చిన్న చూపు. తెలుగులో హుషార్ పిట్టలు ట్రెండ్ సృష్టించబోతుంది. విడుదల తరువాత ఇతర భాషల్లో ఈ తెలుగు సినిమా గురించి మాట్లాడుకుంటారు. పుట్ట చిట్టి పాత్రకు వాసవి ప్రాణం పోసింది. అందు ఆమె కాళ్లు మొక్కుతున్నాను. ఈ రోజు మా కాన్ఫిడెంట్‌కు కారణం ఏమిటో ఈ సినిమా విడుదల తరువాత అందరికి తెలుస్తుంది' అన్నారు. హీరో అన్న మాట్లాడుతూ.. నా ఫేవరెట్ సింగర్ మంగ్లీ నా సినిమాలో పాట పాటడం ఆనందంగా ఉంది. ఈ పాటకు మంచి ట్యూన్‌ను చరణ్ అర్జున్ అందించారు. ఈ రోజు నా ఆత్మవిశ్వాసానికి కారణం దర్శకుడు బిక్షు, నిర్మాత వెంకట్. టీజర్ విడుదల చేశాం. చాలా వైరల్ అయ్యింది. టీజర్ చూసి అందరూ మిస్ అండర్ స్టాండింగ్ చేసుకున్నారు. సినిమా చూసిన తరువాత అందరి ఆలోచన మారిపోతుంది. సినిమాలో అసలైన మ్యాటర్ సినిమాలో ఉంది. నా సినిమాలో ఉన్న కంటెంట్ నాతో ఇంత కాన్ఫిడెన్స్‌ను ఇచ్చింది' అన్నారు. హీరోయిన్ వాసవి గణేశిషన్ మాట్లాడుతూ.. దర్శకుడు, నిర్మాత సజేషన్‌తో ఈ సినిమా చేశాను. సురేష్ ప్రొడక్షన్స్, బెక్కెం వేణుగోపాల్ సహకారంతో ఈ సినిమా స్టాం÷—రగ్ అయ్యింది. టోంగా.,. టోంగా పాట అందరికి నచ్చుతుంది. ఈ సినిమా టీజర్‌తో నాకు చాలా నెగెటివ్ కామెంట్స్ పెట్టారు. అయితే వాసవి గణేశిషన్ వేరు? పుట్ట చిట్టి వేరు.. ఎవ్వరూ ఏమనుకున్నా సినిమా చూసిన తరువాత మీరు డా అర్థం చేసుకుంటారని అనుకుంటున్నాను' అన్నారు.

## వారణాసి కోసం 14 నెలలుగా పనిచేస్తున్నా



రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ హీరోగా భారీ స్థాయిలో తెరకెక్కుతోన్న చిత్రం 'వారణాసి'. మహేశ్‌కు జోడీగా ప్రియాంక చోప్రా మందాకిని పాత్రలో సందడి చేయనున్నారు. తాజాగా ఓ పాడ్ కాస్ట్‌లో ఆమె ఈ సినిమా గురించి మాట్లాడారు. నేను 14 నెలలుగా ఈ సినిమా కోసం పనిచేస్తున్నాను. సినిమాను తెరకెక్కించడానికి రాజమౌళి చాలా సమయం తీసుకుంటారనే సంగతి మనందరికీ తెలిసిందే. ప్రతి సన్నివేశాన్ని క్షుణంగా పరిశీలిస్తారు. ఈ సినిమాలో నేను అద్భుతమైన స్లో మోషన్ జంప్స్ చాలా చేశాను. ప్రస్తుతానికి నేనింతకంటే ఎక్కువ చెప్పలేనని తెలిపారు. ఇటీవల డా వారణాసి గురించి ప్రియాంక మాట్లాడారు. తాను ఇప్పటివరకు చేసిన సినిమాలకు ఇది పూర్తి భిన్నమైనదని పేర్కొన్నారు. ఇప్పటి ఈ సినిమాలోని కీలక సన్నివేశాల షూటింగ్ పూర్తి చేసినట్లు రాజమౌళి తెలిపారు. అక్టోబరు నాటికి మొత్తం షూటింగ్ పూర్తవుతుందని వెల్లడించారు. ఆ తర్వాత పోస్ట్ ప్రొడక్షన్ పనులు మొదలు పెట్టి, వచ్చే ఏడాది జనవరి లేదా ఫిబ్రవరి నుంచి ప్రమోషన్స్ ప్రారంభించే అవకాశం ఉంది. ఏప్రిల్ 7న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది

Published and Editor Owned by Adula Thirupathi, and Printed by vattemula Rama krishna, RK Printers Mig 11, Block No 16, Ground Floor 4, Baghlingampally, Hyderabad 500044. Telangana State. and Published from 16-11-13/A, saleemnagar colony, Malakpet, Hyderabad, Telangana State. **Editor: Adula Thirupathi. RNI NO : TGTEL/25/A4244** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277